1 నుంచి ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

● వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్టీల కోసం సెప్టెంబరు 1 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ చెప్పారు. కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్ నుంచి ఆయన వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఇప్పటి వరకు నిర్వహించిన ఆధార్ శిబిరాల ద్వారా, ఆరు వేలమందికి ఆధార్‌కార్డులను మంజూరు చేశామని తెలిపారు.

స్వామీ నువ్వే దిక్కు!

● శివుడికి, పోలేరమ్మకు కరేడు వాసుల వేడుకోలు
● ఉద్రిక్తతల నడుమ 'చలో కరేడు' ● రైతు, ప్రజాసంఘాల నాయకుల అరెస్ట్



శివాలయంలో పూజలు చేస్తున్న కరేడు వాసులు

ఉలవపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : 'శివయ్యా.. మా గ్రామం చల్లగా ఉండాలి. ఇండో సోల్ సోలార్ కంపెనీ ఇక్కడ నుంచి వెళ్లిపోవాలి. పోలీస్ 30 యాక్ట్ ఎత్తివేయాలి.' అంటూ కరేడు రైతులు, గ్రామస్థులు ముక్కంటీశ్వరుడు, పోలేరమ్మకు మొరపెట్టుకున్నారు. గ్రామంలో భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నేతలు సోమవారం తలపెట్టిన 'చలో కరేడు' ఉద్రిక్తతల మధ్య ముగిసింది. సోమవారం ఉదయం స్థానిక రైతులు, గ్రామస్థులతో కలిసి కరేడు శివాలయంలో ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఓ వినతిపత్రాన్ని స్వామివారి వద్ద ఉంచి వేడుకున్నారు. అనంతరం ర్యాలీగా పోలేరమ్మ రాళ్ల వద్దకు చేరుకుని పూజలు చేసి, తమను కాపాడాలని మొక్కుకున్నారు. ఈ సంద ర్భంగా మీడియాతో ఉద్యమ నేతలు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో విలువైన భూములు దోచుకునే కంటే పడమర ప్రాంతంలో భూములు అందుబాటులో ఉన్నాయని వాటిలో కంపెనీలను పెట్టి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కే ప్రభాకర్‌రెడ్డి, రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శివనాగరాణి, సామాజిక కార్యకర్త వసుంధర, హైకోర్టు న్యాయవాది శ్రీదేవి, ఇతర సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వలేటివారిపాళెం పోలీస్‌స్టేషన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కేశవరావు తదితరులు

● ఉద్యమ నేతల అరెస్టు

కరేడులోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రజా సంఘాలు, రైతు కూలీ సంఘం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రాజమోహన్, ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరావులతోపాటు సుమారు 80 మంది కరేడు ర్యాంపు వద్ద పోలీసుల వలయం నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. వలేటివారిపాళెంలో కేశవరావు, శ్రీనివాసరావు తదితరులు పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండు సెంటరు వరకు ర్యాలీ చేశారు.



నేడు, రేపు వర్షాలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం చిరుజల్లులు కురిశాయి. మంగళ, బుధవారాల్లో కూడా వర్షం కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణశాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిస్సా తీరంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని తెలిపింది. ఇది రాబోయే 12 గంటల్లో వాయుగుండంగా మారే ఆవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాలో తేలికపాటి నుంచి భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది.



సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న వెంకయ్యస్వామి

గొలగమూడిలో ఉత్సవ సంబరం

వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాల ప్రారంభం

తొలిరోజు సర్వభూపాల, కల్పవృక్ష వాహనసేవలు



వెంకటాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడి వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి. వేకువజామున సుప్రభాత సేవ, అభిషేకం, స్వామివారి పూజ, హారతి, ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం ఉత్సవ మూర్తికి అభిషేకం, దత్తసంప్రదాయ షోడసోపచార పూజలు చేశారు. స్వామి సమాధి మందిరాన్ని పూలతో విశేషలంగా అలంకరించారు. ఉదయం 10 గంటలకు గొలగమూడి వాసుల ఆధ్వర్యంలో సర్వభూపాల వాహన సేవ జరిగింది. భక్తుల కోలాటాలు, పండరి భజన, మేళతాళలు, మంగళ వ్యాయిదాల నడుమ వెంకయ్యస్వామిని ఊరేగించారు. గ్రామంలో విహరిస్తున్న స్వామివారికి గ్రామస్థులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

● కల్పవృక్ష వాహనంపై..

రాత్రి వెంకయ్యస్వామి వారు కల్పవృక్షవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఎన్ని రకాల పూలు ఉన్నా కలిపి కడితే అన్నీ ఒకే మాలగా ఉన్నట్లు మనుషులంతా ఒక్కటేనన్న భావనను కలిగించేలా స్వామిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి.

● ఉత్సవాల్లో నేడు

మంగళవారం ఉదయం 10 గంటలకు సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనసేవలు ఉంటాయిన ఆశ్రమ ఈవో బాల సుబ్రహ్మణ్యం తెలిపారు.

బార్‌లకు నోటిఫికేషన్ విడుదల

● జిల్లాకు 50 మంజూరు, దరఖాస్తుల స్వీకరణ
● నేటి నుంచి 26 వరకు గడువు
● జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులు
● ఇక అర్ధరాత్రి 12 గంటల వరకు 'బార్'లా..!

నెల్లూరు(క్రైం) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 31వ తేదీ నాటికి గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన బార్‌ల పాలసీ గడువు ముగియనుంది. దీంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. కొత్త పాలసీలో బాగంగా జిల్లాలో 50 బార్లకు కలెక్టర్ ఆనంద్ గజిట్‌తో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పాలసీ వివరాలను జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ శంకరయ్య విలేకరులకు వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన బార్‌లకు లైసెన్స్ ఫీజులను కేటాయించారు. బార్ల సమయవేళలను ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పెంచారు. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2028, ఆగస్టు 31వ తేదీ వరకు మూడేళ్లపాటు కొత్త పాలసీ అమల్లో ఉంటుంది.

● జిల్లాకు 50..

కొత్త పాలసీ ప్రకారం జిల్లాకు 50 బార్‌లను కేటాయించారు. నెల్లూరు నగరంలో 38, కావలిలో 7, కందుకూరులో 3, ఆత్మకూరులో ఒకటి, బుచ్చిరెడ్డిపాలెంలో ఒకటి కేటాయించారు. జనాభా ప్రాతిపదికన నెల్లూరు కార్పోరేషన్ పరిధిలో రూ.75 లక్షలు, కావలి మున్సిపాలిటీ పరిధిలో రూ.55 లక్షలు, కందుకూరులో రూ.55 లక్షలు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెంలలో రూ.35 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ధారించారు. మూడేళ్ల ఈ పాలసీలో ప్రతి సంవత్సరం లైసెన్స్ ఫీజులో పది శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

● దరఖాస్తుల స్వీకరణ ఇలా

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో బార్‌ల దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తు వేసుకునే వారు రూ.5 లక్షల నాన్‌రీఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో https://oc.hpfsproject.com ద్వారా ఎక్కడ నుంచైనా ఫారం-బీ (ఆర్)లో వివరాలు నింపి ఎన్‌రోల్ చేసుకుని దరఖాస్తు సమర్పించవచ్చు. దరఖాస్తు రుసుము, ప్రాసెసింగ్ ఫీజును డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుచేసుకునే వారు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తును సమర్పించాలి. దరఖాస్తు రుసుము, ప్రొసెసింగ్ ఫీజును డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ.5 లక్షలను డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీస్ పేరు మీద, ప్రొసెసింగ్ ఫీజు రూ.10 వేలను కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పేరు మీద సమర్పించి దరఖాస్తును పూర్తి చేసి ఎక్సైజ్ కార్యాలయంలో అందించాలి.



గీత కులాలకు బార్‌ల కేటాయింపుపై లాటరీ తీయిస్తున్న కలెక్టర్ ఆనంద్

● గీత కులాలకు 5 కేటాయింపు

జిల్లాలో గీత కులాల కోసం ఐదు బార్లను కేటాయించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్ లాటరీ విధానంలో గీత కులాల ప్రాతిపదికన బార్‌లను కేటాయించారు. ఆ ప్రకారం కావలిలో గమళ్ల, కందుకూరులో గౌడ కులస్థులకు కేటాయించి లైసెన్స్ ఫీజు రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు. అల్లూరు నగర పంచాయితీలో గౌడ కులస్థులకు ఒక బార్‌ను కేటాయించి రూ.17.50 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుంది. ఈ నెల 20 నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నెల్లూరులో గౌడ్ కులస్థులకు 2 కేటాయించగా, రూ.37.50 లక్షల లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. 30వ తేదీన లాటరీ విధానంలో బార్‌లు కేటాయిస్తారు.




బార్ పాలసీ వివరాలు వెల్లడిస్తున్న డీసీ శంకరయ్య

● 28న లాటరీ

మంగళవారం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో దరఖాస్తులను స్వీకరిస్తారు. 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. ఆ తర్వాత 28వ తేదీన నగరంలోని జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో లాటరీ విధానంలో బార్‌లను వ్యాపారులకు కేటాయిస్తారు.

నిబంధనలు ఇవే

- ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా, ఎన్ని దరఖాస్తులైనా సమర్పించవచ్చు. ఎన్ని బార్ లైసెన్సులైనా పొందవచ్చు.
- 21 ఏళ్లు దాటిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలి.
- ఒక్కో దరఖాస్తు నాన్‌రీఫండబుల్ రుసుము రూ.5 లక్షలు, ప్రొసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలి.
- దరఖాస్తు విధానం పూర్తయ్యాక, దరఖాస్తుదారుడు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఎంట్రీ పాస్‌లను డౌన్లోడ్ చేసుకొని లాటరీ జరిగే ప్రదేశానికి చేరుకోవాలి.
- ప్రతి దరఖాస్తుతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డును జత చేయాలి.
- దరఖాస్తుదారుడితోపాటు మరొకరికి మాత్రమే లాటరీ జరిగే ప్రదేశానికి అనుమతి ఉంటుంది.
- బార్ కేటాయించిన వెంటనే సంవత్సరం లైసెన్స్ ఫీజులోని ఆరవ వంతు మొత్తాన్ని అదే రోజు చలానా రూపంలో చెల్లించాలి.
- ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వచ్చిన తర్వాత మాత్రమే లాటరీ తీస్తారు. ఒకవేళ రాకుంటే కమిషనర్ దరఖాస్తు సమయాన్ని పొడిగిస్తారు. అయినా రాకుంటే ఆ బార్‌కు రీ నోటిఫికేషన్ ఇస్తారని డీసీ తెలిపారు. ఈ సమవేశంలో ఈఎస్ శ్రీనివాసులు నాయుడు, ఇన్‌స్పెక్టర్లు రమేష్‌బాబు, కిషోర్, ఎస్‌ఐ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



'సోమశిల'లో నీటి నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 24,961 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాంలో 49.066 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,820, ఉత్తర కాలువకు 340, కండలేరుకు 8,350 క్యూసెక్కుల చొప్పున సరపరా చేస్తున్నారు.

● కండలేరులో..

రాపూరు : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 28.59 క్యూసెక్కుల నీరు ఉన్నట్టు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 7,160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,985 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉంది.



ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు

● 23వ తేదీ వరకు వ్యాక్సినేషన్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు టీకాలు వేసేలా కార్యాచరణ రూపొందించారు. 5 నుంచి ఏడేళ్ల విద్యార్థులకు కంఠసర్పి నివారణకు డీపీటీ రెండవ డోసు, పది నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు టీడీ (టెటనస్, డిఫ్తీరియా) టీకా వేస్తున్నారు. శ్వాసకోశ, గుండె, పక్షవాతం వంటి వ్యాధుల నివారణకు డిఫ్తీరియా వ్యాక్సిన్, కండరాల ధ్రుడత్వాన్ని, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ధనుర్వాతం నివారణకు వాక్సిన్ వేస్తున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో తొలిరోజు 2,371 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు.

100 శాతం ఫలితాలే లక్ష్యం

ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుంది. 100 శాతం లక్ష్యాలు సాధించేలా కృషి చేస్తున్నాం. బుధ, శనివారాలు తప్ప మిగిలిన రోజులలో తల్లిదండ్రుల అంగీకారంతో ఈ టీకాలు వేసే కార్యక్రమం జరుగుతుంది. తొలి రోజు కంఠసర్పి, కోరంతదగ్గు, ధనుర్వాతం నివారణకు టీకాలు వేశాము.

- ఉమామహేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి


సేవకులకు దక్కిన న్యాయం

● మాజీ సైనికులకు భూ పంపిణీ ● 20 ఏళ్ల తర్వాత అందుకున్న దేశభక్తులు

దేశభక్తిని ఒంటినిండా నింపుకొని సరిహద్దుల్లో వీరోచిత పోరాటాలు చేసి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు ఎట్టకేలకు న్యాయం దక్కింది. దాదాపు ఇరవై ఏళ్ల నుంచి భూమి కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న మాజీ సైనికుల కల నెరవేరింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటికి ఒకేసారి మోక్షం కలిగింది. జిల్లా అధికార యంత్రాంగం కృషితో 55 మంది మాజీ సైనికులు, వారి కుటుంబాలకు 188 ఎకరాల భూమిని అధికారులు ఒకేసారి పంపిణీ చేయడం విశేషం.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు వారి జీవనార్థం భూమిని రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తుంటాయి. అయితే గడిచిన రెండు దశాబ్దాలుగా భూ పంపిణీ అనేది ఒక ప్రహసనంగా మారింది. మాజీ సైనికులు, వారి కుటుంబాలు దరఖాస్తు చేసుకోవడమే తప్ప ఆ తర్వాత ఫలితం ఉండడం లేదు. ప్రస్తుతం వంద మంది వరకూ మాజీ సైనికులు భూమి కోసం దరఖాస్తు చేసుకొని ఉన్నారు. వీరు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. కొంతమంది కోర్టులకు కూడా వెళ్లి ఆర్డర్లు తెచ్చుకున్నా భూమిని మాత్రం పొందలేకపోయారు. ఇంకొంత మంది మాజీ సైనికులు భూమిని పొందకుండానే మరణించారు. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ సైనిక కుటుంబాల అవస్థలను అనేక కథనాల రూపంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఆ క్రమంలో కలెక్టర్‌గా ఓ ఆనంద్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా జీ హరికృష్ణలు బాధ్యతలు తీసుకున్నారు. మాజీ సైనికులకు భూమి ఇచ్చే విషయంలో వీరు ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఫలితాలు వచ్చాయి. దరఖాస్తులను సైనిక సంక్షేమ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు పంపగానే, రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ పరుగులు పెట్టించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, మాజీ సైనికుల కోరిక మేరకు భూమిని వారికి కేటాయించారు. కొన్నిచోట్ల ఒక్కొక్కరికి ఐదెకరాలు ఇవ్వగా, మరికొన్ని చోట్ల రెండెకరాలు కేటాయించారు. 55 మందికి 188 ఎకరాల భూమిని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఒకేసారి పంపిణీ చేశారు. మరో 40 మందికి భూములిచ్చే ప్రక్రియ కూడా చివరి దశకు చేరుకుంది. ఒకటి, రెండు నెలల్లోనే అర్హులందరికీ భూ కేటాయింపులు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో మాజీ సైనికుల కుటుంబాలకు ఎట్టకేలకు న్యాయం దక్కింది.



వరికుంటపాడులో మాజీ సైనికులకు కేటాయించిన భూమి



టిప్పర్‌ను ఢీకొన్న వాహనం, కింద పడి ఉన్న డ్రైవర్ హుస్సేన్ మృతదేహం

ఇద్దర్ని మింగిన నిద్రమత్తు

● టిప్పర్‌ను ఢీకొన్న టాటా మ్యాజిక్ ● ఇద్దరు దుర్మరణం
● పలువురికి గాయాలు ● బాధితులంతా చెన్నై వాసులు

కొడవలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంధువుల పెళ్లికి వెళ్లామన్న ఆనందం వారిలో ఎంతోసేపు నిలవలేదు. నిద్రమత్తు డ్రైవర్‌తోపాటు ఆ ఇంటి పెద్ద దిక్కును పొట్టన పెట్టుకుంది. కొడవలూరు మండలం నాయుడుపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఆగి ఉన్న టిప్పర్‌ను టాటా మ్యాజిక్ వాహనం ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు చెన్నైకు చెందిన మాధవ్ కావలిలో ఉంటున్న బంధువుల పెళ్లిలో పాల్గొనేందుకు ఐదుగురు కుటుంబసభ్యులతో కలిసి టాటా మ్యాజిక్ వాహనంలో ఆదివారం వచ్చారు. రాత్రి పెళ్లి ముగించుకుని సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు తిరిగి చెన్నైకు బయలుదేరారు. మార్గమధ్యంలోని నాయుడుపాలెం వద్ద 3.30 గంటల సమయంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై డ్రైవర్ కునుకు తీయడంతో ఆగి ఉన్న టిప్పర్‌ను టాటా మ్యాజిక్ ఢీ కొట్టింది. డ్రైవర్ హుస్సేన్ (42), మాధవ్‌రావు (45) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక ఉన్న కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కోటిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంఎస్‌ఎంఈలకు రుణాలందిస్తాం : బీవోఐ 8లో..

నేడు 'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీ

వెంకటాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలాది ట్రాక్టర్లతో 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' విజయోత్సవ ర్యాలీ చేపడుతున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చవటపాళెం సొసైటీ అధ్యక్షుడు రావూరి రాధాకృష్ణమ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చవటపాళెం పీఏసీఎస్ కార్యాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. నాయకులు, రైతులు హాజరు కావాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9543
వెండి కిలో ధర	రూ. 117400
వెండి ఒక గ్రాము	రూ. 120.40

జగనన్న ఇళ్లు.. 'సమస్యల' గూళ్లు!

- ఇళ్ల నిర్మాణాలు కాగితాల పైనేనా?
- విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ నివేదిక వస్తే పనులు ప్రారంభం.!



లబ్ధిదారులకు కేటాయించిన జగనన్న ఇళ్లు ఇవే..

పొదలకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం, నేతలు చేసిన పాపాలు పేదలను నేటికీ వెంటాడుతున్నాయి. ఇళ్లు కాదు.. ఊళ్లు కట్టిస్తున్నాం.. అంటూ జగనన్న కాలనీల పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పైగా ఆస్తి ఇస్తున్నట్లు నాటి ప్రజాప్రతినిధులు ఊదరగొట్టారు. ఇంత చేసినా కనీసం 5 శాతం మంది లబ్ధిదారులు కూడా ఆ ఇళ్లలో నివాసం ఉండ(లే)ని పరిస్థితి నెలకొంది.

● వానొస్తే.. ఇళ్లన్నీ నీటి మడుగులే...

అప్పట్లో తూతూ మంత్రంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వర్షం వస్తే కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. పూర్తి చేసిన ఇళ్లు లబ్ధిదారులకు నివాస యోగ్యంగా లేవు. పునాది దశలో ఉన్న ఇళ్లలో ఇనుప చువ్వలు తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి. కొన్ని మూడో ఆప్షన్ కింద కట్టిన ఇళ్లు కాలితో గట్టిగా తంతే చాలు కూలిపోతున్నాయి. ఇలాంటి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేదెప్పుడో.. నివాసం ఉండే దెప్పుడో.. అని లబ్ధిదారులు వాపోతున్నారు.

● అరకొర నిధులు.. నాణ్యత లేని పనులు

పొదలకూరు మండలంలో గత ప్రభుత్వంలో 5101 పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి తిప్ప వద్ద 1100 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా, అందులో 400 మందికి కాంట్రాక్టర్ ద్వారా ఇంటి నిర్మాణం చేపట్టారు. అయితే మౌలిక వసతులు లేకుండా చేపట్టిన నిర్మాణ పనులు నాసిరకంగా జరిగాయని, సక్రమంగా క్యూరింగ్ జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలకు అందజేసే నిధులు రూ.1.8 లక్షలు. దీంతో నిర్మించుకోలేక చాలామంది సొంతింటిపై ఆశలు వదులుకున్నారు.

● కాసుల కోసం.. కాంట్రాక్టర్ల 'మాయా'జాలం!

ఇదిలా ఉండగా అప్పట్లో అధికార పార్టీకి చెందిన కొంత మంది వ్యక్తులు ఇళ్లు నిర్మిస్తామంటూ కాంట్రాక్టర్ల అవతార మెత్తారు. సొంతింటి కల సాకారం అవుతుందనే ఆశతో లబ్ధిదారులు నిర్మాణాలకు సరే అన్నారు. తీరా చూస్తే.. సిమెంటు ఇటుకలతో రెండు పక్కల సిమెంటు పూత పనులు, కిటికీలు, నాణ్యత లేని నిర్మాణాలు చూసి అవాక్కయ్యారు. అధిక సంఖ్యలో ఇళ్లను నిర్మిస్తున్నాం కాబట్టి ఆ మాత్రం నిర్మాణమైనా జరుగుతుందని, అదే మీరు కట్టుకోవాలంటే మూడింతలు అవుతుందని లబ్ధిదారులకు కాంట్రాక్టర్లు మాయమాటలు చెప్పి తూతూ మంత్రంగా గృహాలను నిర్మించారు. కనీసం విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, ఇంటింటికీ కొళాయి తదితర మౌలిక వసతులు కల్పించలేదు. యూనిట్ ధర రూ.1.8 లక్షలు, డ్వాక్రా రుణం రూ.35 వేలతో కట్టిన ఇళ్లు ఏమాత్రం నాణ్యతగా లేవు. ప్లాస్టింగ్ చేసిన దాఖలాలు లేవు. ఇంటి లోపల అరలు, వంట గది, మరుగుదొడ్ల నిర్మాణాలు చేయకుండా అర్ధంతరంగా వదిలేశారు.

● క్వాలిటీ కంట్రోల్ విభాగం నివేదిక వచ్చాకే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణంలో ప్రాథమిక నిబంధనలు పాటించలేదని, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు పరిశీలించి నివేదిక సమర్పిస్తేనే తిరిగి నిర్మాణ పనులు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖాధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఆ నివేదిక కోసం అధికారులు వేచి చూస్తున్నారు. ఇదంతా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు, అధికారుల పాపమేనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● ఎంఈవో హేమసుందర్‌రావు

ముత్తుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నత విద్యా ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని ఎంఈవో హేమసుందర్‌రావు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు.

?. ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తయిందా

!. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ 75 శాతానికి పైగా పూర్తయింది. ఇంకా కొన్ని పాఠ్య పుస్తకాలు రావాలి. రాగానే పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తాం.

?. నాడు - నేడు పనుల పురోగతి ఎలా ఉంది

!. మండలంలోని పలు పాఠశాలలను చాలావరకూ అభివృద్ధి చేశాం. కొన్ని చోట్ల నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. నిధుల మంజూరు కాగానే నిర్మాణాలు పూర్తి చేస్తాం.

?. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారు

!. ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రధానంగా దళితవాడలు, గిరిజన కాలనీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం. బడి మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించేందుకు మా పరిధిలో అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మనుబోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుపాళెంలో సోమవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక ఉత్సవ నిర్వాహకులు సీహెచ్ వెంకట రమణారెడ్డి, కామేశ్వరి, భవాని, జీవన్ కుమార్, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలపై విచారణ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

ముత్తుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆర్‌ఆర్ కాలనీలో వైసీపీ నాయకులు తీసుకున్న అక్రమ పట్టాలపై విచారణ చేయాలని సీవీఆర్ రామలింగాపురం మత్స్యకార సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నాయకులు ఎల్లంగారి రమణయ్య, ఎల్లంగారి ఎల్లయ్య నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులను మభ్యపెట్టి కొందరు వైసీపీ నాయకులు ఒక్కొక్కరు రెండు, మూడు పట్టాలు తీసుకున్నారని ఆరోపించారు. . ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్టి మహోత్సవం

ముత్తుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలోని శ్రీకృష్ణ మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉట్టి మహోత్సవం సోమవారం ఘనంగా ముగిసింది. ఈ వేడుకల్లో మహిళా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. పిల్లలు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘంతో రైతులకు చేయూత



ప్రమాణ స్వీకారం చేస్తున్న పల్లంరెడ్డి

ముత్తుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు తగిన చేయూతను అందిస్తామని సొసైటీ నూతన అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ముత్తుకూరులోని సొసైటీ కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో రెండుసార్లు డైరెక్టర్‌గా ఎన్నికైన తనను అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎరువులు, రుణాలు, సకాలంలో అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సురేష్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు, కార్యనిర్వాహణాధికారి వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు.. ఇంకెన్నాళ్లు ?



మామిడిపూడి సమీపంలోని ఇరుకు వంతెన

ముత్తుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జెన్‌కో థర్మల్ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో మామిడిపూడి సమీపంలో ఉన్న ఇరుకు వంతెన స్థానికులకు పెద్ద సమస్యగా మారింది. ఈ వంతెనపైనుంచే సమీప పరిశ్రమలకు భారీ వాహనాలు వెళుతుంటాయి. పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు కూడా ఈ మార్గాన్నే వెళుతుంటారు. మండల కేంద్రానికి వెళ్లే ప్రజలు ఈ వంతెనపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వాహనం వస్తే అటువైపు వాహనాలు నిలిచి పోవాల్సిన పరిస్థితి. వాహనాల రద్దీ పెరగడంతో తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు సమయానికి గమ్యస్థానానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వంతెనపై పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. పక్కనే ఉన్న మామిడిపూడి చెరువు కలుజు నీటి ప్రవాహం రహదారిపై చేరుతుంది. అత్యవసర సేవల వాహనాలు కూడా ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం దొరకలేదు. ప్రజలు కొత్తవంతెన నిర్మాణం కోసం డిమాండ్ చేస్తున్నారు. కొత్త వంతెన నిర్మిస్తే భారీ వాహనాల రాకపోకలు సులభమవుతాయి. మండల కేంద్రానికి వెళ్లే మార్గం కూడా సౌకర్యవంతంగా మారుతుంది. కొత్త వంతెన నిర్మాణం తక్షణమే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చీడపీడలపై రైతులకు అవగాహన



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇందుకూరుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జగదేవిపేటలో సోమవారం మండల వ్యవసాయాధికారి డి. రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (జిల్లా వనరుల కేంద్రం) సిబ్బంది ఆధ్వర్యంలో చీడ పీడల నిర్ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మధుసూధన్ మాట్లాడుతూ క్షేత్ర సందర్శనలో వరి మొక్కలో కంకి నల్లి నివారణకు ప్రొఫినోపాసు లేదా ఓమైట్ 2ఎంఎల్, ఒక లీటర్ నీటికి కలిపి, పిచికారి చేసుకో వాలన్నారు. వరిలో పొట్ట కుళ్లు తెగులు నివార ణకు టిల్ట్ (ప్రొఫికోనజోల్) 200ఎంఎల్, ఒక లీటర్ నీటిలో పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి రఘునాథ రెడ్డి మాట్లాడు తూ 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హులైన రైతులు ఈనెల 20వ తేదీ లోపు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ దేవసేన, ఏఓ రామ్మోహన్, శాస్త్రవేత్త నారాయణస్వామి, వీహెచ్ఏ దీక్షిత, రైతులు పాల్గొన్నారు.

101 మంది పింఛన్‌దారులకు నోటీసులు

మనుబోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులతో పాటు వివిధ రకాల పింఛన్లు పొందుతున్నవారిపై ఆరునెలల క్రితం ప్రభుత్వం విచారణ చేపట్టింది. నిబంధనల మేరకు ఎంతమంది పింఛన్లకు అర్హులో గుర్తించి, అనర్హుల జాబితాను తయారుచేసింది. ఈ క్రమంలో మండలంలోని 19 పంచాయతీలలో 101 మందిని అనర్హులుగా గుర్తించింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన వ్యాధి నిర్ధారణ సర్టిఫికెట్ పొంది ఉండాలి. వాస్తవంగా ఎంత శాతం వైకల్యం ఉందో గుర్తించి పింఛన్ అందజేస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిపిన విచారణలో మండలంలో 63మంది వైకల్యం సర్టిఫికెట్ లేనివారు, సరైన శాతం కంటే తక్కువ కలిగిన వారు ఉన్నట్లుగా గుర్తించి, వారిని పింఛన్లకు అనర్హులుగా గుర్తించి తొలగించారు. అలాగే 38 మందిని రూ.4 వేల (సామాజిక) పింఛన్‌కు మళ్లించారు. 101 మందికి ఆయా పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది ఇప్పటికే అనర్హత పత్రాలు అందించారు. అర్హత ఉండి, సరైన పత్రాలు ఉన్నవారికి ప్రభుత్వం త్వరలోనే ఒక తేదీని ప్రకటిస్తుందని, అప్పుడు తిరిగి పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ముజీబున్నీసా సోమవారం తెలిపారు.

ఉద్యోగాల కల్పనకు కృషి

కొడవలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికీ ఉద్యోగావకాశం లభించేలా తీర్చిదిద్ది, ఉజ్వల భవిష్యత్తును అందిస్తా మని శ్రీవెంకటేశ్వర కళాశాల అధినేత డాక్టర్ పి. గుణశేఖర్ పేర్కొన్నారు. కొడవలూరు పంచాయతీ పరిధిలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్, ప్రిన్సిపాల్ తిరుమల వేద పండితులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, బ్లాక్ చైన్, మిషన్ లర్నింగ్ వంటి నూతన సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జయలక్ష్మి, ఏఓ గిరీష్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడికి
బంగారు ఆభరణాల బహూకరణ

సంగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వర స్వామికి సంగం గ్రామానికి చెందిన ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ కోటు సుధాకర్‌రెడ్డి, వాయుసుత దంపతులు రూ. 5.6 లక్షల విలువైన సుమారు 50 గ్రాముల బంగారు ఆభరణాలు బహూకరించారు. ఆ మేరకు సంగమేశ్వరుడికి నుదుట నామాలు, కామాక్షిదేవికి బొట్టు, ముక్కర ఆభరణాలను దాత సమీప బంధువు కోటు వెంకట కరుణాకర్‌రెడ్డి ఈవో రఘురామయ్యకు అందచేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వేమా మల్లిఖార్జునరావు, గ్రంధి గోపికృష్ణయ్య, పూజారి పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలకు పాలభిషేకం



పాలభిషేకం చేస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలమ్మ పాళెంలో సోమవారం 'స్త్రీ శక్తి పథకం' అమలు పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫొటోలను ఆర్టీసీ బస్సు ముందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆ పార్టీ నేతలు ముగ్గురి ఫొటోలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణీ భవాని, జనసేన మండల కార్యదర్శి సందూరి శ్రీహరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

రాపూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా డీపీఎం ఆదేశాల మేరకు సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో భవానీ ప్రకృతి వ్యవసాయ కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండల వ్యవసాయ అధికారి సోమసుందర్, టీడీపీ నాయకులు నల్లవడ్ల వెంకటరమణరెడ్డి, చెన్ను పెంచల్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుబ్బయ్య, అశోక్, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

● కలెక్టర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా నేతల వినతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే వరి కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు, పెనుబల్లి ఎంపీటీసీ చేవూరు వినయ్ నారాయణ డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు, రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో మిల్లర్లు పుట్టి ధాన్యానికి రూ.15 వేలు ధర నిర్ణయించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. తేమశాతం, క్వింటాకు ఒక కేజీ అదనపు దామాషాతో ప్రభుత్వమే రైతుల ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కల్కి హరి సర్వోత్తమ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, మోర్చా కో కన్వీనర్ హనుమారెడ్డి, జిల్లా నాయకులు వెంకట మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

C.R.I.M.E N.E.W.S

జామాయిల్ తోటలో మహిళ మృతదేహం గుర్తింపు

కావలిరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం శివారులోని జామాయిల్ తోటలో సుమారు 50-55 ఏళ్ల గుర్తుతెలియని కుళ్లిపోయిన మహిళ మృతదేహాన్ని సోమవారం రైతులు గుర్తించి వీఆర్ఏ రాములుకు సమాచారమిచ్చారు. వీఆర్ఏ సమాచారంతో రూరల్ ఎస్ఐలు బాజిబాబు, తిరుమలరెడ్డి, వీఆర్వో దత్తమ్మ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అయితే 15 నుంచి 20 రోజుల మధ్యన మృతి చెంది ఉండవచ్చని, అందుకే పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉందని నిర్ధారించారు. మృతదేహానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదు. మృతదేహంపై ఆరంజ్ కలర్ చీర, ఎర్ర జాకెట్, తెలుపు రంగు లంగా, మెడలో నల్లపూసల దండతో పాటు మృతదేహం పక్కన లభించిన సంచిలో ఎర్రచీర, జాకెట్ లభించాయి. మహిళ కాళ్లకు రెండు రకాల చెప్పులు ఉండటంతో మతిస్థిమితం లేని యాచకురాలై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్ఐ బాజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో నిండు గర్భిణీ మృతి

నెల్లూరు(క్రైం) ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో నిండుగర్భిణీ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, సైదాపురం మండలం లింగసముద్రంలో పెంచలమ్మ నివాసం ఉంటోంది. ఆమె కుమార్తె వెంకటరమణమ్మ (38)ను, నెల్లూరులోని చలపతినగర్‌లో నివాసం ఉంటున్న పొట్లూరు వెంకటనారాయణకు ఇచ్చి 18 ఏళ్ల క్రితం వివాహం చేశారు. పదేళ్ల క్రితం వారికి ఓ కుమార్తె జన్మించింది. అనంతరం వెంకటరమణమ్మ ఆలస్యంగా గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె తొమ్మిది నెలల గర్భిణీ. ఆమెకు షుగర్, థైరాయిడ్, బీపీ ఉన్నాయి. ఈ క్రమంలో తల్లి పెంచలమ్మ నెల్లూరుకు వచ్చి కుమార్తె వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి వెంకటరమణమ్మ గుండెనొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే భర్త, తల్లి జీజీహెచ్‌కి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే చనిపోయిందని ధ్రువీకరించారు. దీంతో మృతురాలి తల్లి సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో వైద్యులు వర్సెస్ నర్సులు

- మేల్ స్టాఫ్‌నర్సుపై హౌస్‌సర్జన్ దాడి
- నిరసనకు దిగిన బాధితవర్గం



జీజీహెచ్‌లో నిరసన తెలుపుతున్న నర్సులు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్‌లో డాక్టర్లు, నర్సుల మధ్య వివాదం చినికిచినికి గాలివానగా మారింది. సోమవారం సాయంత్రం ఓ హౌస్‌సర్జన్, మేల్ స్టాఫ్‌నర్సుపై దాడి చేశాడు. దీంతో నర్సులు నిరసనకు దిగారు. గతంలో జరిగిన ఓ చిన్నపాటి వివాదాన్ని మనసులో పెట్టుకొని మేల్ స్టాఫ్‌నర్సుపై హౌస్ సర్జన్ దాడి చేశారు. దీంతో జీజీహెచ్‌లోని స్టాఫ్ నర్సులు, నర్సులంతా నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా బాధితుడు వెంకట్ మీడియాతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ఓ రోగికి తీవ్ర అస్వస్థతగా ఉండటంతో త్వరగా వైద్యం అందించాలని డ్యూటీ డాక్టర్ తేజ్‌ను కోరానని తెలిపాడు. అయితే ఆ డాక్టర్ 'నువ్వు నర్సువు.. నాకు చెప్పడం ఏమిటి' అని ఆగ్రహించాడని పేర్కొన్నారు. ఈ విషయమై వివాదం పెద్దది కాకుండా డాక్టర్, మేల్ నర్సుకు మధ్య కొందరు సర్దుబాటు చేశారు. అయినా సోమవారం రాత్రి జూనియర్ డాక్టరు, వెంకట్‌పై దాడి చేశారు. అడ్డుకున్నవారిపై కూడా దాడికి దిగాడు. దీంతో నర్సులు దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కి చేరుకుని న్యాయం చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు స్టాఫ్ మేల్‌నర్సు ఇచ్చిన ఫిర్యాదుపై విచారిస్తున్నారు.

రైలులో నుంచి యువకుడిని తోసేసిన నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం) ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణిస్తున్న రైలులో నుంచి యువకుడిని తోసి హత్య చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు, ఈనెల 15న తిరువనంతపురం-షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో వెస్ట్‌బెంగాల్, సౌత్24 పర్గానాస్ జిల్లా, గతీభకారిమా గ్రామానికి చెందిన హబిరుల్లా మొల్లా(32) ప్రయాణిస్తున్నాడు. రైలు వెంకటాచలం-వేదాయపాలెం రైల్వేస్టేషన్‌ల మధ్యకు రాగానే వెస్ట్‌బెంగాల్‌కు చెందిన సైఫుల్‌మండల్ రైలో నుంచి మొల్లాను తోసి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు నిందితుడిని నగరంలోని జీజీహెచ్ సమీపంలో అరెస్ట్ చేశారు. రైల్లో సీటు విషయంలో హబిరుల్లా మొల్లా, సైఫుల్‌మండల్ మధ్య జరిగిన చిన్న వివాదమే హత్యకు కారణమని రైల్వే ఇన్స్‌పెక్టర్ సుధాకర్ తెలిపారు.

లారీ ఢీకొని షెడ్డు ధ్వంసం

మర్రిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-కడప సరిహద్దు వద్ద పోలీసులు తనిఖీల కోసం ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రేకుల షెడ్డును సోమవారం తెల్లవారుజామున లారీ ఢీకొనడంతో ధ్వంసం అయింది. సిమెంట్ లోడుతో బద్వేలు వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవటంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ ముందుబాగం నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు

నెల్లూరు (లీగల్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చాడన్న కేసులో నేరం రుజువు కావడంతో ప్రళయ కావేరి చిన్నకు ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ అబ్దుల్ రహమాన్ సోమవారం తీర్పు చెప్పారు. నెల్లూరు దర్గామిట్టకు చెందిన ఫిర్యాది టీవీకే నరసింహారావు కథనం మేరకు వివరాలు.. నెల్లూరు నవాటుపేటకు చెందిన చిన్న తన కుటుంబ అవసరాల కోసం నరసింహారావు వద్ద 2018 మార్చి 22న రూ.7,50,000 అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చాడు. సదరు అప్పు తీర్చే నిమిత్తం 2019 మార్చి 27న చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకులో ప్రజెంట్ చేయగా అది చెల్లలేదు. దీంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా 2019 మే11న చిన్నకు లీగల్ నోటీసు ఇచ్చి, కోర్టులో ఎన్ఐయాక్టు కింద ప్రైవేటు కంప్లైంట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో పైవిధంగా జైలుశిక్షతోపాటు చెక్కు మొత్తానికి రెండింతల మొత్తాన్ని (అనగా రూ. 15 లక్షలు) పరిహారం కింద ఫిర్యాదికి చెల్లించాలని, అందులో రూ.10 వేలు ప్రభుత్వానికి చెల్లించాలని చిన్నను ఆదేశిస్తూ న్యాయాధికారి ఉత్తర్వు జారీ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100):	520



రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తాం : ప్రదీప్

నెల్లూరురూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యో తి): రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తామని పముజుల ప్రదీప్ తెలిపారు. గుండ్లపాళెం పీఏసీఎస్ ఛైర్మన్‌గా సోమవారం ఆయన సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ రైతులకు సొసైటీ సేవలను దగ్గర చేయ డంతోపాటు వారి భాగస్వామ్యాన్ని పెంచు తామని చెప్పారు. ఆర్థికంగా అండగా నిలిచే క్రమంలో రుణాలు పంపిణీ చేయడంతోపా టు వాటిని సకాలంలో తిరిగి జమ చేయి స్తామని పేర్కొన్నారు. అనంతరం సొసైటీ డైరెక్టర్లుగా కుండా సురేష్‌రెడ్డి, రాపూరు పెంచలయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో తుళ్లూరు మల్లికార్జున్ గౌడ్ పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ...

ఎయిడెడ్‌ను పునరుద్ధరిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుదల

● జీ వెంకట రమణారెడ్డి, సర్వోదయ కళాశాల కరస్పాండెంట్, ఈవో

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వోదయ కళాశాల ఒకప్పుడు నెంబర్-1 స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఆ కళాశాల 200 మంది విద్యార్థులకే పరిమితమైంది. ఎయిడెడ్‌ను పునరుద్ధరిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆ కళాశాల కరస్పాండెంట్, ఈవో జీ వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు.

? కళాశాలకు ప్రభుత్వ ఎయిడెడ్ ఉందా.

! 2019వ సంవత్సరం వరకు ఉండేది. 2020లో రద్దు అయింది.

? ఎయిడెడ్ రద్దు కారణంగా కళాశాల పై ఎంత భారం పడింది.

! ఎయిడెడ్ రద్దు కావడంతో కళాశాల పై సంవత్సరానికి రూ.39లక్షల భారం పడింది.

? కళాశాలకు ఆదాయం ఎంత.

! కళాశాలకు ఏడాదికి రూ.21,74,151 ఆదాయం వస్తున్నది. కళాశాలకు 27 వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. మరో 13 షాపులు నిర్మించాం. అవి ప్రారంభమైతే నెలకు మరో రూ.9లక్షల ఆదాయం వస్తుంది.

? విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనాలున్నాయి.

! విద్యార్థులకు ఉచిత విద్యను స్కాలర్‌షిప్‌ల ద్వారా అందచేస్తున్నాం. మధ్యాహ్న భోజనాన్ని కూడా ఉచితంగా పెడుతున్నాం.

? కళాశాల భవనాలు భద్రమేనా.

! కళాశాలలో ఉత్తరం వైపునున్న భవనాలు శిథిలావస్థకు చేరాయి. దాతలు ముందుకు వస్తే పునర్‌నిర్మిస్తాం.

మస్టర్లలో తేడాలొస్తే ఊరుకోను

● నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి కనకాద్రి

నెల్లూరు(సిటీ), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సిబ్బందిని లెక్కించే మస్టర్లలో లోపాలు తలెత్తితే ఊరుకోనని ఎంహెచ్‌వో కనకాద్రి హెచ్చరించారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లోని మస్టర్ల పాయింట్ల వద్ద ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్స్‌స్పెక్టర్లు, సెక్రటరీలు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. చిన్నలోపం కూడా కనిపించకూడదని స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణలో రోజురోజుకు మెరుగుదల కనిపించాలన్నారు. అనంతరం ఏసీ కూరగాయల మార్కెట్, పాత మున్సిపల్ కార్యాలయం, తోటబడి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. నగరవాసులు తమ ఇళ్లలోని చెత్త మున్సిపల్ వాహనాలకే అందించాలని తెలిపారు. రోడ్లపై, మురుగుకాలువల్లో వేయరాదని పేర్కొన్నారు.



మస్టర్ పాయింట్ వద్ద ఉద్యోగులతో ఎంహెచ్‌వో కనకాద్రి

పెళ్లిళ్లకు సిద్ధం!

మరమ్మతులు పూర్తయిన టీటీడీ ఏసీ కల్యాణ మండపం



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీటీడీ ఏసీ కల్యాణ మండపం పెళ్లిళ్లకు సిద్ధమైంది. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా అన్నీ సౌకర్యాలను టీటీడీ కల్పించింది. నాన్ ఏసీగా ఉన్నప్పుడు అద్దె రూ.7వేలుగా ఉండేది. ఏసీ సౌకర్యం కల్పించాక అద్దెను రూ.90 వేలు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో టీటీడీ కల్యాణ మండపాలు 9 ఉన్నాయి. వాటిలో 6 మండపాలను ప్రైవేటు వ్యక్తులకు టీటీడీ లీజుకి ఇచ్చింది. నెల్లూరు, గూడూరు, అల్లూరు కల్యాణ మండపాలు ప్రస్తుతం టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

● **భక్తుల విజ్ఞప్తుల మేరకు..**

నెల్లూరు టీటీడీ కల్యాణ మండపం ఉరుపు, విద్యుత్ సరఫరా వంటి సమస్యలు తలెత్తడంతో మరమ్మతుల కోసం కల్యాణాల బుకింగ్‌లు ఆపివేశారు. తాత్కాలిక మరమ్మతులతో కాకుండా ఏసీ సౌకర్యంతో కల్యాణ మండపాన్ని మరమ్మతు చేయాలని భక్తుల విజ్ఞప్తులను టీటీడీ గుర్తించి ఏసీ సౌకర్యానికి శ్రీకారం చాటింది. కరోనా మహమ్మారి, కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా ఇది అందుబాటులోని రావడానికి దాదాపు 30నెలలకు పైగా సమయం పట్టింది. మండలం బుక్ చేసుకునేవారు 0861-2327409, 98480 77677 నంబర్లును సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలే..

టీటీడీ ఏసీ కల్యాణ మండపానికి అద్దెను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరే వసూలు చేస్తాం. ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసుకోవాలి. ఈ ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు అనుగుణంగా నిర్ణయించారు. ఇతర ప్రైవేటు ఏసీ కల్యాణ మండపాల అద్దెలతో పోలిస్తే టీటీడీ ఏసీ కల్యాణ మండపం చార్జీలు 1/3 వంతు ఉంటాయి.



- రామ్‌గోపాల్,
టీటీడీ కల్యాణ మండపాల జిల్లా మేనేజర్

కానల్లు కురవాలి..

పల్లెలో నీటి వ్యథ

వానదేవుడా..!?

● వర్షం కోసం కొమ్మరపూడి వాసుల ఎదురుచూపు

● చినుకులు రాలితేనే 700 ఎకరాలకు సాగునీరు

● వర్షాధారంపైనే 600 కుటుంబాల జీవనం

నెల్లూరురూరల్,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : వర్షం కురవాలి... కానీ వరదలు రాకూడదు.. సగటు వ్యక్తి కోరుకునేదిదే. కానీ ఆ.. ఊరి ప్రజలు వానలు కురవాలి.. వరదలు రావాలి..అని నిత్యం కోరుకుంటూ ఉంటారు. గ్రామంలో రెండు చెరువులున్నా, వర్షంపడితే తప్ప నీళ్ల చేరవు. వీటి ఆధారంగా 700 ఎకరాల సేద్యం, 600 కుటుంబాలు జీవనం మరో 700 మూగజీవాలు మనుగడ ఆధారపడున్నాయి. నెల్లూరుకి 15 కి.మీ పడమరనున్న కొమ్మరపూడి గ్రామ దుస్థితిది. నెల్లూరు రూరల్ మండలంలో సాగునీటి వనరులు లేని ఏకైక గ్రామం ఇది.





నల్ల, ఎర్ర చెరువులు

కొమ్మరపూడిలో 8 వార్డులతోపాటు 600 గడపలు కలిగి, సుమారుగా 2,400 మంది వరకు జీవిస్తున్నారు. గ్రామానికి నల్ల, ఎర్ర చెరువులున్నాయి. ఇవీ పూర్తిగా వర్షాధారణ పైనే ఆధారపడ్డాయి. భారీ వర్షాలు, వరదలు వస్తే తప్ప ఇవి నిండవు. ఇవీ నిండితే తప్ప వీటి కిందున్న 600 ఎకరాల ఆయకట్టు, మరో వంద ఎకరాల లోతట్టు సాగుకు నీరందదు. పైగా గ్రామంలో తాగునీటికి ఏర్పాటు చేసిన 4 బోర్లకు చెరువుల భూగర్భ జలాలద్వారానే నీటి సరఫరా జరగాలి. కాగా గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు సుమారుగా 700ల వరకు ఉన్నాయి వీటికి దాహార్తి తీరేది ఈ చెరువుల్లోని నీటి ద్వారానే...

● **వర్షాన్ని బట్టి పంటల ఎంపిక**

ఈ గ్రామ రైతులు వర్షాలను బట్టి పంటలను ఎంపిక చేసుకుంటారు. భారీ వర్షాలు, వరదలు వచ్చి నల్ల, ఎర్ర చెరువుల్లో పుష్కలంగా నీళ్ల చేరితే అప్పుడు ఆయకట్టు రైతాంగం వరి సాగు చేసేందుకు సిద్ధమవుతారు. సాధారణ వర్షాలు వచ్చి చెరువుల్లోకి స్వల్పంగా నీళ్ల చేరితే వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తారు. కాగా నెల్లూరుకి 15 కి.మీ పడమరనున్న ఈ గ్రామానికి సాగునీటి వనరులు లేవు. కొండలు, అడవుల్లో పడిన నీళ్ల వరదల రూపేణా వస్తే తప్ప మరో మార్గంలేదు.

వర్షం వస్తేనే పంట

జిల్లాలో భారీ వర్షాలు, వరదలు వస్తేనే చెరువుల్లోకి నీళ్ల వస్తాయి. అలా వస్తేనే మేము పంటలు వేసుకోగలం. చెరువులు పూర్తిగా నిండి చాలా ఏళ్ల అవుతుంది. వరి పైరు వేయాలంటే చెరువులు పూర్తిగా నిండాలి.



- దొడ్ల సుబ్రమణ్యం, రైతు

ప్రకృతి దయతలిస్తేనే...

ప్రకృతి దయతలచి, వరుణదేవుడు మా ఊరివైపు చూస్తే తప్ప మాకు నీటి వసతి లేదు. మా ఊరికి బయట్నుంచి నీళ్ల వచ్చే మార్గమే లేదు. కొండలు, అడవుల్లో నుంచి వరదలు వస్తే తప్ప. తాగునీటికి చెరువుల పైనే ఆధారపడాలి.



- పచ్చపాల రమణయ్య, రైతు

అన్నిటికీ ఇబ్బందే..

వర్షాలు కురిసి నీళ్ల చెరువుల్లోకి చేరితేనే.. లేకుంటే అన్నింటికీ ఇబ్బందే. పశువులు, ప్రజలు చెరువుల పైనే ఆధారపడ్డారు. ఎత్తిపోతల పథకం కూడా త్వరగా పూర్తి చేసి నీటిని అందుబాటులోకి తీసుకువస్తే సంతోషం.



- కాకి రమణయ్య

జలజీవన్ మిషన్ కింద గ్రామాలకు సురక్షితమైన తాగునీరు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఫ్లోరోసిస్ వ్యాప్తి అధికంగా ఉందని, బాధిత ప్రజలకు రక్షణ కల్పించాలని రాజ్యసభసభ్యుడు బీఎమ్మార్ సోమవారం రాజ్యసభలో కోరారు. వారికి సురక్షితమైన తాగునీరు, వైద్య సహాయం అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. ఇందుకు కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సోమన్న స్పందిస్తూ దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ కింద సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. రసాయన కాలుష్యం, ముఖ్యంగా ఫ్లోరైడ్ సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇచ్చి పైప్‌లైన్ నీటి సరఫరా పథకాలు చేపడుతున్నామన్నారు. ఏపీలో 9జిల్లాల్లో ఫ్లోరోసిస్ నివారణకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

నేడు రాధాకృష్ణుల నగరోత్సవం



రాధాకృష్ణుల విగ్రహం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్‌లో కృష్ణాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన రాధాకృష్ణులు (మృతికా) నాలుగు రోజులపాటు పూజలు అందుకున్నారు. చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు, బాలాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ఇక్కడ కృష్ణాష్టమి వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం ఈ వేడుకల ముగింపు సందర్భంగా ఉదయం రాధాకృష్ణుల విగ్రహానికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారంతో నగరోత్సవం, నిమజ్జనం నిర్వహించనున్నారు. ఈ నగరోత్సవం బాలాజీనగర్, ఏసీనగర్ మీదుగా వచ్చి మినీ బైపాస్ రోడ్డుల మీదుగా ఆత్మకూరు బస్టాండ్, శెట్టిగుంటరోడ్డు సెంటర్ మీదుగా వెళ్లి పెన్నానదిలో నిమజ్జనం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కొట్టే వెంకటేశ్వర్లు కోరారు. కాగా సోమవారం బాలాజీనగర్‌లో రాధాకృష్ణులకు ఏసీ సుబ్బారెడ్డి, నాగిశెట్టి మురళి, కే.ప్రసాద్‌రెడ్డి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ విచ్చేసి రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆకుల హనుమంతరావు, రమేష్, దుర్గా, హరి, తదితరులు పర్యవేక్షించారు.



అన్న ప్రసాద వితరణ చేస్తున్న ఏసీ సుబ్బారెడ్డి తదితరులు

న్యూస్ బాక్స్

కార్పొరేషన్ పీజీఆర్‌ఎస్‌కి 49 అర్జీలు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కి నగరవాసుల నుంచి అధికారులకు 49 అర్జీలు అందాయి. వివిధ కేటగిరీల కింద ప్రజలు తమ సమస్య లను పరిష్కరించాలని కోరుతూ వినతులు సమర్పించారు. టిడ్కో గృహాలు, ఇంటి అనుమతులు, ఇంటి పన్నులు, పారిశుధ్యం, పించన్లు తదితర అంశాలపై పౌరులు వీటిని అధికారులకు అందచేశారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి తగు పరిష్కారం చేపట్టాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. అనంతరం పలు సమీక్షల్లో ఆయన పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నుంచి యువతను కాపాడండి



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రదీప్

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాదకద్రవ్యాలకు బాని సలవుతున్న యువతను రక్షించాలని ప్రజావిజ్ఞప్తులదినం సందర్భంగా సోమవారం జమా యితే ఇస్లామీ హింద్ నాయకులు ఎస్పీ వినతిపత్రం అందజేశారు. నగరంలోని జెండా వీధి, కోటమిట్ట, మన్సూర్‌నగర్. ఖుద్దూస్‌నగర్, కుక్కలగుంట, శెట్టిగుంటరోడ్డు, వెంగళరావు నగర్, వైఎస్ఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో యువత మాదకద్రవ్యాలకు బానిసలైనందున స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. రాత్రి పూట గస్తీ పెంచా లని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ నవీద్ అహ్మద్, అఫ్సర్‌బేగ్, నూరుల్లా పాల్గొన్నారు.

కావలి జిల్లా కావాలి

కావలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కావలి కేంద్రంగా కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. పులి రజని, పులి చక్రపాణి పాల్గొన్నారు.

విగ్రహాల అందం... నగరం సుందరం !





వివిధ కూడళ్లలో లోహపు ప్రతిమల ఏర్పాటు

నగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నగరంలోని అండర్‌బ్రిడ్జిల గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు, రోడ్డు డివైడర్లపై రకరాల మొక్కలు నాటడం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రధాన కూడళ్లలో మెటల్‌తో వివిధ విగ్రహాలను రూపొందిస్తున్నా రు. అవి ప్రజలను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో హరనాథపురం సెంటర్‌లో యోగా చేస్తున్న వ్యక్తుల మెటల్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అక్కడే మెటల్‌లో సింహం ప్రతిమను కూడా రూపొందించారు. జాతీయ రహదారిపై ఉన్న ఓ ప్రైవేటు కంపెనీ కుడ్యంపై లోహపు కుందేలు విగ్రహాన్ని తయారు చేసి ఉంచారు. అలాగే కార్పొరేషన్‌లో మెరిసిపోతున్న మెటల్ సింహం బొమ్మను ఉంచారు. నగర ప్రజలను ఇవి ఎంతో ఆకర్షిస్తూ... ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.







- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



పైపులే నివాసాలు

● వర్షంలో వలస వాసుల కష్టాలు

ఎడతెరపిలేని వర్షంతో వలస వాసులు కష్టాలు పడుతున్నారు. నూజివీడు ప్రాంతానికి చెందిన ఐదు కుటుంబాలు చంటి బిడ్డలతో కలిసి ఇనుప మంచాలు, కుర్చీలు ఊరూరా విక్రయించేందుకు వారం రోజుల క్రితం ఉదయగిరి పట్టణానికి వచ్చారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద చెట్లను నివాసాలు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. అయితే గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని చిరుజల్లులు పడుతుండడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. వర్షం కారణంగా వ్యాపారం లేకపోవడంతో పూట గడవడమే కూడా కష్టమైందని, చంటిబిడ్డలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వర్షానికి అక్కడే ఉన్న నీటి పైపులే నివాసాలుగా మార్చుకుని సేదతీరుతున్నారు. చెట్ల కింద గాలికి, వర్షానికి పొయ్యి మీద వంట చేసుకుంటూ అరకొరగా ఆకలి తీర్చుకుంటున్నారు. దాతలు ఎవరైనా స్పందించి తమకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని వేడుకుంటున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

నాడు విధ్వంసం.. నేడు పర్యాటక సుమం

ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు 2010లో పట్టణంలోని ఆనకట్ట సమీపం లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో అతిథిగృహం, హోటల్ నిర్వహణకు భవనాలు నిర్మించారు. నాటి నుంచి ఆ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోకుండానే అద్దాలు ధ్వంసమై చిల్లచెట్లు పెరిగి మూగజీవాలకు, అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం ఆ భవనా లను పూర్తిగా గాలికొదిలేయడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక భవనాలను వాడుకలోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించింది. అందులో భాగంగా పర్యాటక శాఖ అధికారులు ఆ భవనాలను అద్దె ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేందుకు ప్రకటన ఇవ్వడంతో ఓ వ్యక్తి వాటిని దక్కించుకు న్నాడు. ఈ క్రమంలో అతను చిల్లచెట్లను తొలగించి భవనాలకు రంగులుదిద్ది, పగలిన అద్దాల స్థానం లో కొత్త అద్దాలు ఏర్పాటుచేసి హోటల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యల తో శిథిలావస్థకు చేరిన భవనాలు వాడుకలోకి వస్తున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



నాడు



నేడు

నేతాజీని మరిచారు!



ఉదయగిరి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దేశం స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని విస్మరించడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నేతాజీ వర్ధంతి కాగా మండలంలోని గండిపాళెం గ్రామ ప్రధాన వీధిలో రహదారికి ఆనుకొని ఉన్న విగ్రహం వైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూడకపోవడం, కనీసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకుంటూ పూలదండ కూడా వేసిన పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీతలు పెంచుదాం!

ఆక్వా రైతులకు రొయ్యల పెంపకంలో ఎదురయ్యే సమస్యలకు ప్రత్యామ్నాయంగా పీతల పెంపకాన్ని నిపుణులు సూచిస్తున్నారు. రొయ్యల సాగులో మన జిల్లా ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు పొంది ఉంది. అదేవిధంగా పీతల సాగుకు కూడా ఇది అనుకూలమైన ప్రాంతంగా అధికారులు చెబుతున్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఇప్పటికే పీతల పెంపకం సాగుతోంది. థాయిలాండ్, తైవాన్, ఫిలిప్పైన్స్, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ దేశాల్లో పీతల పెంపక వ్యాపారం ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ పీతల పెంపకాన్ని అధికారులు ప్రోత్సహిస్తున్నారు. మన ప్రాంతంలో సిల్లా సెర్రేటా, సిల్లా ఒలివేషియా అనే రెండు రకాల బురద పీతలను పెంపకానికి అందుబాటులో ఉంచారు. వాటి వివరాలు తెలుసుకుందాం....

● లాభదాయకంగా సాగు ● రెండు రకాలు అనుకూలం
● రొయ్యల సాగుకు ప్రత్యామ్నాయం
● ఆశాజనకంగా ధరలు
● దేశవిదేశాలకు ఎగుమతి అవకాశం

దాణా ఇలా..

పీతల పెరుగుదల మెరుగయ్యే ఆహారాన్ని దాణాగా అందించాల్సి ఉంటుంది. పీతలు ప్రధానంగా మాంసాహారులు కాబట్టి చిన్న చిన్న నత్తలు, రొయ్యపిల్లలు, చిన్న చేపలు తదితరాలను ఆహారంగా తీసుకుంటాయి. ఈ క్రమంలో ఎండు చేపలు, నత్తమాంసాన్ని ఆహారంగా అందించాలి. పీత సైజును బట్టి 5 నుంచి 10 శాతం ఆహార పరిమాణం ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. ట్రేల ద్వారా నీటిలో ఉంచడం, తాళ్లతో వేలాడదీయటం, చల్లడం ద్వారా ఆహారాన్ని అందించవచ్చు.

ధరలు భళా..

కిలో బరువున్న పీతల ధర మార్కెట్లో రూ1200 వరకు ధర పలుకుతోంది. కిలో కన్నా ఎక్కువ బరువుంటే రూ.1500 నుండి రూ2 వేల వరకు ధర పలుకుతాయి. ఇలా ఆశాజనకమైన ధరకుతోడు స్థానికంగా, ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశమూ ఉంది.



సిల్లా సెర్రేటా

ఈ రకం పీతలను గుర్తించాలంటే వాటి లక్షణాలు తెలుసుకోవాలి. వాటి కాళ్ళమీద పాలిగోనల్ గుర్తులు, మణికట్టు మీద రెండు పదునైన ముళ్లు, పీత పైడొప్ప భాగం లేత ఆకుపచ్చ నుండి ముదురు ఆకుపచ్చ రంగు కలిగి ఉంటుంది. వీటిని మన వాడుక భాషలో ఆకుపచ్చ పీతలు అంటారు. ఇవి దాదాపు 2.5 కిలోల వరకు బరువు పెరుగు తాయి. అత్యధికంగా వీటినే పెంచుతారు. 80 నుంచి 100 గ్రాముల బరువు గల పీతల పెంపకం చేపడితే నాలుగు నెలల్లో 400 నుండి 500 గ్రాముల వరకు బరువు పెరుగు తాయి. ఏడు నెలల్లో 800 నుండి 1000 గ్రాముల బరువు పెరుగుతాయి.

నీటి యాజమాన్యం

పీతల పెంపకంలో నీటి యాజమాన్యం అత్యంత కీలకం. తరచూ నీటిని మార్చడం మంచిది. తద్వారా నీటిలోని కాలుష్యం తగ్గి పీతల ఎదుగుదలకు దోహదపడుతుంది. నీటి గాఢత 10 నుండి 35, ఉదజని 7.5 నుంచి 8.5 వరకు ఉండేలా చూసుకోవాలి. ఉష్ణోగ్రత 25 నుంచి 30 డిగ్రీలు, ప్రాణవాయువు 4 పీపీఎం కంటే ఎక్కువ ఉండేలా గమనించుకోవాలి. అప్పుడప్పుడు పీతల బరువును తూచి పెరుగుదలను పరిశీలించాలి.

జాగ్రత్తలు అవసరం

పీతలు పెంచే చేరువు గట్టు మీద 10 నుండి 20 ఎంఎం గల వలను ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా పీతలు బయటకు వెళ్లకుండా నివారించవచ్చు. ఇవి స్వయం భక్షక లక్షణం కలిగి ఉన్నందున అప్పుడే గుల్ల విడిచిన పీతలకు ఇతర పీతల నుంచి ప్రమాదం పొంచి ఉంటుంది. దీనిని అధిగమించడానికి హైడౌట్లు ఏర్పాటు చేసుకోవాలి. పీవీసీ పైపులు, సిమెంట్ పైపులు, పెంకులు వంటివి చెరువుల్లో ఏర్పాటు చేసుకోవాలి. పీతలు పట్టే సమయంలో వాటి కాళ్లు విరిగిపోకుండా జాగ్రత్త వహించాలి, లేకపోతే బరువు, ధర తగ్గే అవకాశం ఉంటుంది.



పెంపకం విధానాలు

● **బాహ్య పెంపకం :** ఈ విధానంలో తీరప్రాంతంలోని ఇసుక నేలల్లోగానీ, మట్టినేలల్లోగానీ ఏర్పాటు చేసిన చెరువుల్లో పీతలు పెంచుతారు. 0.5 హెక్టార్ల చిన్న చెరువులను పెంపకానికి ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో పీతలను 4 నుంచి 6 నెలలు పెంచి 500 గ్రాములు పైబడిన వాటిని విక్రయించుకోవచ్చు.

● **చెరువు తయారీ..:** మంచి పీతల పంట తీయటానికి చెరువు తయారీ చాలా ముఖ్యమైన అంశం. చెరువును ఎండబెట్టిన తరువాత దున్ని నేల ఉదజని సూచికను బట్టి సున్నం వినియోగించాలి. తద్వారా చెరువులో ఉన్న పరభక్షకాలు, హాని చేసే సూక్ష్మజీవులు, ఇతర మేత పోటీదారులు నశిస్తాయి. అంతే కాకకుండా నేలలోని విష ప్రభావం తగ్గుతుంది. ఒక ఎకరం చెరువులో క్రాబ్‌లెట్స్ అయితే 700 నుంచి 1000 వరకు, 70 నుంచి 100 గ్రాముల బరువున్న పీతలైతే 300 నుండి 350 వరకు పెంపకం చేపట్టవచ్చు.

● **ఫేటనింగ్ :** ఈ విధానంలో పెంపకం అంటే పీతలు గుల్ల విడిచిన తరువాత వాటిని చెరువుల నుంచి సేకరించి వేరొక చోట బాక్సుల్లోగానీ చెరువుల్లోగానీ ఉంచి మేతను అందిస్తారు. వాటి పెంకు గట్టిపడేంతవరకు 3 నుంచి 4 వారాలు పెంచుతారు. 150 గ్రాముల నుంచి 500 గ్రాముల బరువు కలిగిన గుల్ల విడిచిన పీతలు 3 నుంచి 4 వారాల్లో 250 నుంచి 650 గ్రాముల బరువు పెరుగుతాయి. ఈ ఫేటనింగ్ పద్ధతికి 0.1 నుంచి 0.2 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన చెరువులనుగానీ హెచ్‌డీపీవీ బాక్సులను వినియోగిస్తారు. ఒక్కొక్క పీతకు ఒక్కొక్క బాక్సును ఏర్పాటు చేస్తారు. చెరువుల్లో అయితే ఒక చదరపు మీటరుకు ఒకటి, రెండు పీతలు పెరిగేలా వదులుకోవలసి ఉంటుంది. ఈ విధానాన్ని తక్కువ ఖర్చుతో లాభదాయకమైనదిగా పరిగణిస్తారు.



సిల్లా ఒలివేషియా

ఈ జాతి పీతలు ఒకే ఒక్క ముల్లు కలిగి ఉండడం, డొప్ప పైరంగు ఆకుపచ్చ రంగుతో కూడిన ముక్కుపొడి రంగులో ఉంటుంది. కింది భాగంలో ఉన్న కాళ్లు ముదురు ఎరుపు రంగుగానీ, గులాబీ రంగుతో కూడిన ఎరుపు రంగులోగానీ ఉంటాయి. దాదాపు 700 గ్రాముల వరకు బరువు పెరుగుతాయి.

- అల్లూరు,(ఆంధ్రజ్యోతి)

శిక్షణ, ప్రోత్సాహం అందిస్తాం : షేక్ చాంద్‌బాషా , మత్స్య శాఖ ఏడీ



రొయ్యల పెంపకంలో నష్టపోతున్న రైతులు పీతల పెంపకంపై దృష్టిపెట్టాలి. దీనిపై సంపూర్ణ అవగాహనతో పెంపకం చేపడితే అత్యంత ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. తెల్లమచ్చ సమస్య తప్ప ఇతర సమస్యలు లేకపోవడంతో పెంపకం సులభం. మార్కెట్లో డిమాండ్, ఆశాజనకంగా ధరలు ఉన్నారు. ఆక్వా రైతులకు ఇది ఒక ఆర్థిక వనరుగా ఉపయోగపడుతుంది. మత్స్యశాఖ తరపున పీత పిల్లలను తమిళనాడు తెప్పించి సాగుదారులకు అందిస్తాం. పిల్లల ధర కిలో రూ.700 వరకు ఉంటుంది. ఒక కిలోకు 200 నుంచి 300 వరకు పిల్లలు వస్తాయి. వీటికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తోంది. ఒక హెక్టారులో సాగుకు సుమారు రూ.6లక్షల వరకు పెట్టుబడి అవసరం. 8 నెలల్లో మూడింతల ఆదాయం పొందవచ్చు. పీతల సాగుకు రైతులు ముందుకు వస్తే వారికి అవసరమైన శిక్షణ, సలహాలు, సూచనలు అందిస్తాం.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 78 వినతులు



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కి జిల్లావ్యాప్తంగా 78 మంది బాధితులు తరలి వచ్చి వారి సమస్యలపై వినతులు సమర్పించారు. ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఫిర్యాదులను స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఫిర్యాదులను ఎస్పీతోపాటు నగర డీఎస్పీ సింధుప్రియ, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

● తన కుమారులు ఇంటి నుంచి తరిమేశారని, రాత్రిపూట బస్టాండ్‌లో పడుకుంటున్నానని, తినడానికి తిండి కూడా లేదని కావలికి చెందిన ఓ వృద్ధురాలు కన్నీరు పెట్టుకుంది. కొడుకు, కోడలు పట్టించుకోవడం లేదని, విచారించి న్యాయం చేయాలని ఆమె ఎస్పీని కోరింది.

● ఉన్న ఆస్తిని మొత్తం రాయించుకొని తన చిన్న కుమారుడు ఇంటి నుంచి గెంటివేశాడని, కొట్టి వేధిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని నగరంలోని సంతపేటకు చెందిన ఓ వృద్ధురాలు వేడుకొంది.

● తన భర్త చెడు వ్యసనాలకు బానిసై ఇంట్లో ఉన్న వస్తువులు, బంగారు నగలు అమ్మేశాడని, పిల్లల పోషణ కూడా కష్టంగా ఉందని నెల్లూరుకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. విచారణ చేసి న్యాయం చేయాలని కోరింది.

● ముత్తుకూరుకి చెందిన ఓ వ్యక్తి కుమారుడు అనుమానాస్పదంగా మరణించాడని, కేసు నమోదు చేశారని సమగ్రంగా విచారణ జరిపి తన కుమారుడు మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి కోరారు.

● ఉదయగిరికి చెందిన మహిళను అదే ప్రాంతానికి చెందిన వెంకట్‌కుమార్ ప్రేమపేరుతో పరిచయం పెంచుకొని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియాలో ఫొటోలు అప్లోడ్ చేసి ఇబ్బంది పెడుతున్నాడని, విచారించి న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.

● నెల్లూరు వేదాయపాలెంకు చెందిన ఓ మహిళకు 15 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఆత్మకూరుకి చెందిన దుర్గాభవానీ అనే మహిళ ఇన్స్టాగ్రామ్‌లో తన కుమారుడితో పరిచయం పెంచుకొని బలవంతంగా పెళ్లి చేసుకున్నదని ఆమె ఫిర్యాదు చేసింది. ఆ మహిళపై చర్యలు తీసుకొని తన కుమారుడిని తనకు అప్పగించాలని ఆ మహిళ కోరింది.

పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలు సంతృప్తి చెందేలా మెరుగైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల స్వీకరణలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, జడ్పీ సీఈవోమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

● **అందిన వినతులు 426**

పీజీఆర్ఎస్‌కు సోమవారం 426 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూశాఖవి 129, సర్వేశాఖవి 34, మున్సిపల్‌శాఖవి 31, మిగిలినవి వివిధ శాఖలకు సంబంధించినవి.

● **గోడపత్రిక ఆవిష్కరణ**

దేశసేవ నుంచి పల్లె సేవలో భాగంగా కేంద్రీయ సైనిక్ బోర్డు, రాష్ట్ర సైనిక్ బోర్డు కలిసి జిల్లా సైనిక బోర్డుద్వారా జిల్లాలోని సైనికులకు కోరమండల్ కంపెనీ ద్వారా డ్రోన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆనంద్ తిక్కనభవన్‌లో ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని మాజీ సైనికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రంగానికి ప్రాధాన్యం

● ఇతోధికంగా రుణాలిస్తాం : బీవోఐ జీఎం ఉన్నికృష్ణన్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎంఈ రంగానికి ప్రథమప్రాధాన్యతను ఇచ్చి ఇతోధికంగా రుణాలు అందచేస్తున్నామని బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) జనరల్ మేనేజర్ జీ. ఉన్నికృష్ణన్ తెలిపారు. సోమవారం నగరంలోని ఒక హోటల్ సమావేశ మందిరంలో ఆ బ్యాంకు ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సాహిస్తోందన్నారు. తమ బ్యాంకు ద్వారా ఎంఎస్ఎంఈ రంగంతోపాటు ఇతర అన్నిరకాల రుణాలు అందచేస్తున్నదన్నారు. తమ బ్యాంకు రూ.15లక్షల కోట్ల వ్యాపారం చేస్తున్నదని వివరించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.16లక్షల కోట్ల వ్యాపారాన్ని అధిగమించనున్నదని చెప్పారు. అత్యధిక వడ్డీని అందించే అనేక పథకాలు తమ బ్యాంకులో ఉన్నాయని ఆయన వివరించారు. సులభంగా తమ బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారుల సందేహాలకు ఆయన సమాధానం ఇచ్చారు. విజయవాడ జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు బ్యాంకు ఆఫ్ ఇండియా సేవలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎస్ఎంఈసీఎల్ సమీరన్, నెల్లూరు మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ సందీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీవోఐ జనరల్ మేనేజర్ ఉన్నికృష్ణన్

జీజీహెచ్‌లో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి

● గుండెనొప్పి అనడంతో జైలు నుంచి వైద్యశాలకు..



నెల్లూరు(క్రైం) ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రుస్తుం మైనింగ్ కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం నెల్లూరు జీజీహెచ్‌లో చేరారు. గుండె నొప్పిగా ఉందని ఆయన చెప్పడంతో జైలు అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి హార్ట్‌బీట్ తక్కువగా ఉందని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతానికి శ్రీకాంత్‌రెడ్డి ఆరోగ్యం నిలకడగానే ఉందని, గుండె వైద్య నిపుణుల పర్యవేక్షణలో క్యాథ్‌లాబ్ పరీక్ష నిర్వహించాల్సి ఉందని జైలు అధికారులకు వైద్యులు వివరించారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డిని తిరిగి జైలుకు తీసుకువచ్చారు. రెండు రోజుల్లో తిరుపతి రుయాకు తరలించి, వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

50శాతం రిజర్వేషన్ల అమలు కోసం ధర్నా

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకీప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు 2012లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీప్రకారం, 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన విధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ధర్నాలో నాయకులు ఆర్. పురు షోత్తం, శ్రీరామ్, కే. అశోక్, శివభాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

గిరిజన సంక్షేమాధికారి బదిలీ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా పనిచేస్తున్న పీటీకే పరిమళను అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డీడీగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుదాఘాతానికి యువ రైతు బలి

జలదంకి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పొలంలో దుక్కి చేసేందుకు ట్రాక్టర్ తీసుకెళ్లిన యువరైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెంలో సోమవారం జరిగింది. వివరాల మేరకు.. కొత్తపాలెంకు చెందిన యువరైతు గునుపాటి సురేష్‌రెడ్డి(35) పొలంలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. ముందుగా కూరగాయల తోటకు సాగునీరు పెట్టేందుకు విద్యుత్ మోటారు వేసి పక్కన పొలంలో దుక్కి దున్నడం ప్రారంభించాడు. మధ్యలో మోటారు పంపు ద్వారా నీరు రావడం నిలిచి పోవడాన్ని గమనించిన ఆయన ఏమైందో చూడడానికి ట్రాక్టర్‌ను నిలిపివేసి మోటారు వద్దకు వెళ్లేందుకు పంటకాలువ దాటుతుం డగా అదుపుతప్పి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మ ర్‌పై పడ్డాడు. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్‌కు అతుక్కుపోయాడు. ఈ ఘటనను గమనించిన చుట్టుపక్కల పొలాల్లో రైతులు అక్కడకు చేరుకుని పరిశీలించగా అప్పటికే సురేష్‌రెడ్డి మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి మృతదేహన్ని ఆయన ఇంటికి చేర్చారు. ఉదయాన్నే పొలానికి వెళ్లి శవమై ఇంటికి వచ్చిన సురేష్‌రెడ్డిని చూసి తల్లిదండ్రులు, భార్యతో పాటు బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.



సురేష్‌రెడ్డి (ఫైల్)

రేపు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

ఉదయగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎల్ రామ్మోహన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 9543
వెండి కిలో ధర	రూ. 117400
వెండి ఒక గ్రాము	రూ. 120.40

లీకేజీలు పట్టించుకోరా!?

● వరద కాలువ ద్వారా నీరు వృథా ● పట్టించుకోని అధికార యంత్రాంగం

అనంతసాగరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల నుంచి ఏటా కండలేరుకు వరద కాలువ ద్వారా నీరు ఇవ్వడం సహజం. అయితే కాలువ డొల్లతనం గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో నీరు వృథాగా పోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమశిల ప్రాజెక్టు నుంచి కండలేరుకు నీరు సరఫరా చేసే ప్రధాన కాలువ మూడు కిమీ మేరకు కాంక్రీట్ నిర్మాణం (గోడ) నిర్మించారు. పనుల సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో గోడనాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కాలువకు నీరు వదిలే ప్రతిసారీ లీకేజీ ధారలు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లీకేజీ వల్ల ఎలాంటి ప్రమాదం వాటిల్లుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. ప్రస్తుతం 7,000 క్యూసెక్కులు సరఫరా జరుగుతోంది. కాలువ వెంబడి 3కిమీ లీకేజీలు కనిపిస్తున్నాయి. గతంలో కోట్లు ఖర్చుచేసి గ్రౌంటింగ్ పనులు చేశారు. ఎలాంటి ఫలితం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని లీకేజీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



లీకేజీతో చెమ్మబారిన కాలువ గోడ

సీపీఎం నేతల అరెస్టుపై నిరసన

ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కరేడు ప్రాంతంలో ఓ ప్రైవేట్ కంపెనీకి భూములను అప్పగించే విషయంలో గ్రామస్థులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఆత్మకూరు ప్రాంతం నుంచి వెళ్లిన సీపీఎం నేతలను అక్కడి పోలీసులు అరెస్ట్ చేయడం అమానుషమని సోమవారం స్థానిక మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు ఆత్మకూరు నాగయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సంధాని మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి కరేడు ప్రాంతానికి వెళ్లిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ఆత్మకూరు సీపీఎం కార్యదర్శి కె డేవిడ్‌రాజు, రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్, సీపీఎం అనుబంధాల సంఘాల నాయకులు యస్థానీ, గద్దర్‌బాబు తదితరులను పోలీసులు అరెస్టుచేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు నాగేంద్ర ఆళ్ల హజర్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు దారుణం

● **ఉదయగిరి:** ఇండోసోల్ కంపెనీకి భూములు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా, రైతు కూలీ సంఘాలు పిలుపునిచ్చిన చలో కరేడు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయించడం దారుణమని ఏపీ రైతుసంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని చూడడం అవివేకమన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన ప్రజాసంఘాలు, సీపీఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని, ఇండోసోల్ కంపెనీకి భూ కేటాయింపులు రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు మస్తాన్‌రెడ్డి, కేశవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మర్రిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతికుమారి దంపతులు సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మర్రిపాడు మండల కేంద్రంలోని వారి నివాస ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కల్యాణోత్సవానికి ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంత ప్రజలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, కొమ్మి లక్ష్మయ్యనాయుడు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మూడోరోజైన సోమవారం భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

●**ఉదయగిరి:** మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అలంకరించి విశేష పూజలు నిర్వహించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. యువకులు ఉట్టి మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆంజనేయస్వామికి..

సంగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మొదటి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి

వీరబ్రహ్మేంద్రస్వామికి పల్లకీ సేవ

ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న వీరబ్రహేంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పల్లకి సేవలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉభయదాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సంగమేశ్వరుడికి బంగారు ఆభరణాల బహూకరణ

సంగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వర స్వామికి సంగం గ్రామానికి చెందిన ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ కోటు సుధాకర్‌రెడ్డి, వాయుసుత దంపతులు రూ. 5.6లక్షల విలువైన సుమారు 50 గ్రాముల బంగారు ఆభరణాలు బహూకరించారు. ఆమేరకు సంగమేశ్వరుడికి నుదుట నామాలు, కామాక్షిదేవికి బొట్టు, ముక్కర ఆభరణాలను దాత సమీప బంధువు కోటు వెంకట కరుణాకర్‌రెడ్డి ఈవో రఘురామయ్యకు అందచేశారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు వేమా మల్లిఖార్జునరావు, గ్రంధి గోపికృష్ణయ్య, పూజారి తదితరులు పాల్గొన్నారు.



ఈవోకు ఆభరణాలు అందచేస్తున్న దాత కోటు సుధాకర్‌రెడ్డి సోదరుడు

భీమేశ్వరాలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈవో రఘురామయ్య

సంగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లులో దేవాదాయశాఖ పరిధిలో ఉన్న భీమేశ్వరాలయానికి సోమవారం పాలక కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల దేవదాయ శాఖ ఆలయ కమిటీ చైర్మన్‌గా పగడాల రఘురామయ్యను, పూజారితోపాటు కలిపి ఏడుగురిని కమిటీ సభ్యులుగా ప్రకటించింది. దీంతో ఈవో రఘురామయ్య కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

మైనింగ్ అనుమతులు రద్దుచేసి ప్రాణాలు కాపాడండి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు, భాస్కరాపురం గ్రామాల రెవెన్యూ పరిధిలోని కొండ ప్రాంతంలో మంజూరుచేసిన మైనింగ్ అనుమతులను రద్దుచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలంటూ సోమవారం సర్పంచ్ దిలీప్ కుమార్ గ్రామస్థులతో కలిసి కందుకూరులో సబ్‌కలెక్టర్ హిమ వంశీకి వినతిపత్రం అందజేశారు. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపితే కొండను ఆనుకొని ఉన్న జంగంరెడ్డిపల్లి వాసులతో పాటు సమీప గ్రామాల ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని విన్నవించారు. అలాగే నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక లోనూ డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌లతో సహా జిల్లా మైనింగ్ శాఖ ఏడీ శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్ కుమార్‌లను కలిసి అనుమతులు రాకుండా చూడాలని కోరుతూ నివేదికలు అందజేశారు. ఆయన వెంట వినియోగదారులు, మానవ హక్కుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్, మేధావుల ఫోరం సభ్యులు సరాబు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారం : ఆర్డీవో

ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఆర్డీవో బి పావని తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారం కాలేని సమస్యలను మాత్రమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. భూసమస్యల పరిష్కారం కోసమే ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, మండల స్థాయి రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు అక్కడే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో డాక్టర్ పావని

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : ఎంపీడీవో

సంగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్ధాంతరంగా ఆగిన పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో షాలెట్ గృహ నిర్మాణ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆమె కార్యాలయంలో మండలంలోని గృహనిర్మాణ శాఖ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయాలవారీగా ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో మంజూరైన ఇళ్లు, పనులు ప్రారంభించినవి, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం అదనపు సాయం మంజూరు చేస్తునందువల్ల లబ్ధిదారులను చైతన్యపరిచి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ గౌస్‌మొహిద్దీన్, ఈవోఆర్డీ ప్రసాద్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ బాష, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షిస్తున్న ఎంపీడీవో షాలెట్

ఫీల్డ్‌అసిస్టెంట్‌పై ఎంపీడీవోకు ఫిర్యాదు

మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్ మధు తమకు ఉపాధి పనులు కల్పించడంలేదని గ్రామస్థులు ఎంపీడీవో షాలెట్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుంచి ఇంతవరకు ఒక్కరోజు కూడా పని కల్పించలేదని ఫిర్యాదు చేశారు. ఐదు నెలలుగా అడుగుతున్నా ఇదిగో అదిగో అంటూ తాత్సారం చేస్తూ గ్రామంలోని మరో వర్గానికి పనులు కల్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించి న్యాయం చేస్తామని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక దుకాణాల సముదాయంతోపాటు గ్రామంలో ఇంటింటికి తిరిగి లార్వా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా దోమలు వ్యాప్తి చెందకుండా నిల్వ ఉన్న నీటిని తొలగించి శుభ్రం చేయించారు. అలాగే సీజన్‌లో సంభవించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ప్రజలు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు కన్పించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ప్రాథమిక పాఠశాలలో విద్యావలంటీరు నియామకం

ఉదయగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పూర్వ విద్యార్థి సహకారంతో విద్యావలంటీర్‌ను నియమించినట్లు ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎనిమిది తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడంతో విద్యాబోధన కష్టతరమైందని, ఈ విషయాన్ని గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. వెంటనే పాలకొండ వెంకటేష్ అనే పూర్వ విద్యార్థి స్పందించి విద్యావలంటీర్‌కు అయ్యే ఖర్చు రూ.60 వేలు తానే భరిస్తానని ముందుకొచ్చాడన్నారు. దీంతో విద్యావలంటీర్‌ను నియమించి విద్యార్థులకు విద్యాబోధన చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ప్రశాంతికుమారి, విశ్రాంత హెచ్ఎం రత్నం, ఎస్ఎంసీ చైర్మన్ దేవకుమారి, పూర్వ విద్యార్థులు జయసింహా, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు



నిధుల మంజూరు పత్రాన్ని చూపుతున్న టీడీపీ నాయకులు

అనంతసాగరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు పంచాయతీ లక్కరాజుపల్లిలో కోదండరామ స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల అభివృద్ధికి దేవదాయ శాఖ నుంచి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఆలయాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేశారని, అందుకు సంబంధించిన నిధుల మంజూరు పత్రం నాయకులు శాఖమూరి సుబ్బారావు, శాఖమూరి వెంకటేశ్వర్లు, కమ్మ ప్రభాకర్‌నాయుడు, మెట్టుకూరు సుబ్బారెడ్డి తదితరులు మంత్రి కార్యాలయం నుంచి పొందారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



నవాజ్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

ఉదయగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న మండల విద్యావనరుల కేంద్ర మెసెంజర్ షేక్ నవాజ్‌ను స్థానిక కార్యాలయంలో సోమవారం అధికారులు, సిబ్బంది సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎల్ రామ్మోహన్, ఎంపీడీవో అప్పాజీ, ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, టీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ మంజూరు పత్రాల అందజేత



స్కాలర్ షిప్‌లకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీబీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు యువ అన్‌స్టాపబుల్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం వారికి స్కాలర్‌షిప్ మంజూరు పత్రాలను ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య అందచేశారు. ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యంను ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ మృతికి సంతాపం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి వైద్యశాల పరిధిలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్ రామ్‌కుమార్ ప్రమాదవశాత్తు మృతిచెందడం బాధాకరమని హంస అసోసియేషన్ నియోజక వర్గ కార్యదర్శి యనమల శ్రీనివాసులు అన్నారు. సోమవారం రామ్‌కుమార్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేయడంతో పాటు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోండి

ఏఎస్ పేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉండి నమోదు చేసుకోని రైతులు 20వ తేదీలోగా రైతుసేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు సోమవారం ప్రకటన ద్వారా తెలిపారు. నమోదు చేసుకున్న వారికి 2వ విడతలో నగదు పడతుందని తెలిపారు.

●**సంగం :** అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన సమస్యల నమోదుకు బుధవారం చివరి తేదీ అని మండల వ్యవసాయాధికారి శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం నగదు జమకాని రైతులు వెంటనే ఆర్ఎస్‌కేలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి గ్రీవెన్స్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింకు కాని రైతులు బ్యాంకులకు వెళ్లి ఎన్‌పీసీఐ లింకు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

జామాయిల్ తోటలో మహిళ మృతదేహం గుర్తింపు

కావలిరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం శివారులోని జామాయిల్ తోటలో సుమారు 50-55 ఏళ్ల గుర్తుతెలియని కుళ్లిపోయిన మహిళ మృతదేహాన్ని సోమవారం రైతులు గుర్తించి వీఆర్‌ఏ రాములుకు సమాచారమిచ్చారు. వీఆర్‌ఏ సమాచారంతో రూరల్ ఎస్‌ఐలు బాజీబాబు, తిరుమలరెడ్డి, వీఆర్వో దత్తమ్మ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అయితే 15 నుంచి 20 రోజుల మధ్యన మృతి చెంది ఉండవచ్చని, అందుకే పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉందని నిర్ధారించారు. మృతదేహానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదు. మృతదేహంపై ఆరంజ్ కలర్ చీర, ఎర్ర జాకెట్, తెలుపు రంగు లంగా, మెడలో నల్లపూసల దండతో పాటు మృతదేహం పక్కన లభించిన సంచిలో ఎర్రచీర, జాకెట్ లభించాయి. మహిళ కాళ్లకు రెండు రకాల చెప్పులు ఉండటంతో మతిస్థిమితం లేని యాచకురాలై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్‌ఐ బాజీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో నిండు గర్భిణి మృతి

నెల్లూరు(క్రైం) ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో నిండుగర్భిణీ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, సైదాపురం మండలం లింగసముద్రంలో పెంచలమ్మ నివాసం ఉంటోంది. ఆమె కుమార్తె వెంకటరమణమ్మ(38)ను, నెల్లూరులోని చలపతినగర్‌లో నివాసం ఉంటున్న పొట్లూరు వెంకటనారా యణకు ఇచ్చి 18 ఏళ్ల క్రితం వివాహం చేశారు. పదేళ్ల క్రితం వారికి ఓ కుమార్తె జన్మించింది. అనంతరం వెంకటరమణమ్మ ఆలస్యంగా గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె తొమ్మిది నెలల గర్భిణీ. ఆమెకు షుగర్, థైరాయిడ్, బీపీ ఉన్నాయి. ఈ క్రమంలో తల్లి పెంచలమ్మ నెల్లూరుకు వచ్చి కుమార్తె వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి వెంకటరమణమ్మ గుండెనొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే భర్త, తల్లి జీజీహెచ్‌కి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే చనిపోయిందని ధ్రువీకరించారు. దీంతో మృతురాలి తల్లి సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదం : ఒకరిపై దాడి

కావలి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థలం వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన సోమవారం కావలి పట్టణ పాతూరులో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పాతూరులోని పోలువారి వీదిలో పోలు వెంకట శ్రీనివాసకుమార్ కుటుంబం నివాసం ఉంటుంది. వీరి ఇంటి పక్కనే ఈయనకు వరుసకు సోదరుడైన పోలు వెంకటకృష్ణ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. అందులో వెంకట శ్రీనివాసకుమార్‌కు చెందిన అర అడుగు మేరకు స్థలం ఆక్రమించారు. దీనిపై వీరిరువురికి వివాదం జరుగుతుంది. దీంతో వెంకటకృష్ణ, ఆయన సోదరులైన శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఏడాది కాలంగా వెంకట శ్రీనివాసకుమార్‌పై తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో సోమవారం వెంకట శ్రీనివాస్ కుమార్ పాలకేంద్రానికి పాలు పోసేందుకు పాలక్యాన్లు మోటారు బైక్‌కు తగిలించుకుని ఇంటి నుంచి బయలుదేరాడు. ఆయనను రోడ్డులో వెంకటకృష్ణ అడ్డగించి దాడికి పాల్పడ్డాడు. భర్త కేకలు విన్న భార్య లక్ష్మీరాజ్యం అక్కడికి వచ్చి అడ్డుకోబోగా ఆమెను వెంకటకృష్ణ అసభ్యకరంగా దూషించాడు. గాయపడిన వెంకట శ్రీనివాస కుమార్‌ను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి విధుల్లో ఉన్న పోలీసు కానిస్టేబుల్ వివరాలు నమోదు చేసుకున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఉదయగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి-కొత్తపల్లి మార్గమధ్యంలో సీతారామపురం గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీనివాసులు అనే వ్యక్తిపై దాడి చేసిన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం తెలిపారు. వివరాల మేరకు.. శ్రీనివాసులు తన ఆటోలో సీతారామపురం గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తికి చెందిన హైరర్స్ సామాగ్రిని తీసుకొస్తున్నాడు. ఈనేపథ్యంలో ఆయా గ్రామాల మార్గమధ్యన వంశీ, సురేంద్ర, సాయి ఆటోను నిలిపి అతనితో వివాదానికి దిగారు. అటుగా వచ్చిన నాగసుబ్బారెడ్డితో కలిసి ఎక్స్‌కవేటర్‌తో ఆటోను, అందులో ఉన్న జనరేటర్‌ను ధ్వంసం చేశారు. ఈమేరకు బాధితుడు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారితోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలులో నుంచి యువకుడిని తోసేసిన నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం) ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణిస్తున్న రైలులో నుంచి యువకుడిని తోసి హత్య చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు, ఈనెల 15న తిరువనంతపురం-షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో వెస్ట్‌బెంగాల్, సౌత్24 పర్గానాస్ జిల్లా, గలీభకారిమా గ్రామానికి చెందిన హబిరుల్లా మొల్లా(32) ప్రయాణిస్తున్నాడు. రైలు వెంకటాచలం-వేదాయపాలెం రైల్వేస్టేషన్‌ల మధ్యకు రాగానే వెస్ట్‌బెంగాల్‌కు చెందిన సైఫుల్‌మండల్ రైలో నుంచి మొల్లాను తోసి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు నిందితుడిని నగరంలోని జీజీహెచ్ సమీపంలో అరెస్ట్ చేశారు. రైల్లో సీటు విషయంలో హబిరుల్లా మొల్లా, సైఫుల్‌మండల్ మధ్య జరిగిన చిన్న వివాదమే హత్యకు కారణమని రైల్వే ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.

లారీ ఢీకొని షెడ్డు ధ్వంసం

మర్రిపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-కడప సరిహద్దు వద్ద పోలీసులు తనిఖీల కోసం ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రేకుల షెడ్డును సోమవారం తెల్లవారుజామున లారీ ఢీకొనడంతో ధ్వంసం అయింది. సిమెంట్ లోడుతో బద్వేలు వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవటంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు

నెల్లూరు (లీగల్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చాడన్న కేసులో నేరం రుజువు కావడంతో ప్రళయ కావేరి చిన్నకు ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ అబ్దుల్ రహమాన్ సోమవారం తీర్పు చెప్పారు. నెల్లూరు దర్గామిట్టకు చెందిన ఫిర్యాది టీవీకే నరసింహారావు కథనం మేరకు వివరాలు.. నెల్లూరు నవాబుపేటకు చెందిన చిన్న తన కుటుంబ అవసరాల కోసం నరసింహారావు వద్ద 2018 మార్చి 22న రూ.7,50,000 అప్పుగా తీసుకుని ప్రామిసరి నోట్ రాసి ఇచ్చాడు. సదరు అప్పు తీర్చే నిమిత్తం 2019 మార్చి 27న చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకులో ప్రజెంట్ చేయగా అది చెల్లలేదు. దీంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా 2019 మే11న చిన్నకు లీగల్ నోటీసు ఇచ్చి, కోర్టులో ఎన్‌ఐయాక్టు కింద ప్రైవేటు కంప్లైంట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో పైవిధంగా జైలు శిక్షతోపాటు చెక్కు మొత్తానికి రెండింతల మొత్తాన్ని (అనగా రూ. 15 లక్షలు) పరిహారం కింద ఫిర్యాదికి చెల్లించాలని, అందులో రూ.10 వేలు ప్రభుత్వానికి చెల్లించాలని చిన్నను ఆదేశిస్తూ న్యాయాధికారి ఉత్తర్వు జారీ చేశారు.

ఎక్స్‌రే యంత్రాన్ని వినియోగంలోకి తెస్తాం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న హెచ్‌డీసీ కమిటీ సభ్యులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వా స్పత్రిలో ఈ నెల 22న ఎక్స్‌రే యంత్రాన్ని వినియోగంలోకి తెస్తామని ఆస్పత్రి హెచ్‌డీసీ కమిటీ సభ్యులు ఏలిమేటి సతీష్, హనుంతరావు, సరిత తెలిపారు. ఆంధ్రజ్యోతిలో 'దాతలిచ్చినవీ వినియోగించుకోలేరా? ప్రభుత్వాస్పత్రిలో నిరుపయోగంగా ఎక్స్‌రే మెషిన్' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో హెచ్‌డీసీ కమిటీ సభ్యులు స్పందించారు. సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరిశీలించారు. ఎక్స్‌రే యంత్రం, నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌ను పరిశీ లించి ఆస్పత్రి సూపరిండెంట్ రమేష్‌తో మాట్లాడారు. ఈనెల 22న నుంచి ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రాన్ని అందుబాటులోకి తెస్తామని, అలాగే అంబు లెన్స్‌ను కూడా స్వచ్ఛంద సంస్థకు అప్పగించి పేదలకు ఉపయోగ పడేలా చొరవ తీసకుంటామని చెప్పారు.

దాడి కేసులో వైసీపీ నేత అరెస్ట్

చిల్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన వైసీపీ నేత వేమారెడ్డి కుమరస్వామిరెడ్డిని ఓ దాడి కేసులో సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మోమిడి గ్రామానికి చెందిన టీడీపీ నేత జాకీర్ మత్స్యకారులకు సంబంధించిన బోట్ల రిజిస్ట్రేషన్ విషయంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, విచారించి సరిచేయాలని మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి ప్రోద్బలంతో ఆయన అనుచరులైన కొంతమంది జాకీర్‌పై దాడి చేసేందుకు అతని ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో జాకీర్ ఇంట్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై జాకీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఈనెల 8వ తేదీన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దాడికి ప్రోత్సహించిన వైసీపీ నేత కుమారస్వామిరెడ్డిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడంతో న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేదలు పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు గోపినాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, బాలు, వెంకటకృష్ణయ్య, రమణయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ భూములకు పరిహారం అందించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం తీసుకున్న భూములకు పరిహారం అందించాలని కోట మండలం గున్నంపడియ గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నై - బెంగళూరు ఇండ్రస్టియల్ కారిడార్ కోసం ప్రభుత్వం తమ గ్రామంలో సుమారు 200 ఎకరాల వరకు భూములను సేకరించడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు రైతులకు పరిహారం అందించలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మట్టం శ్రావణి

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని, తగిన జాగ్రత్తలు పాటించాలని తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు పీహెచ్‌సీలో తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రి సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శ్రావణి మాట్లాడుతూ ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేసుకునే వీలుంటుందన్నారు. పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలి

చిల్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నక్కలకాలవకండ్రిగ వద్ద ఉన్న ప్రభుత్వ మిగులు భూములను నెలబల్లి రెట్టపల్లి గ్రామస్తులు సుమారు 22 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, రమేష్, సునీల్, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలి

నాయుడుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. సోమవారం నాయుడుపేట విక్రమ్ కళాశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, బాధితుల పట్ల వివక్షత చూపకుండా మానవతా దృక్పథంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.సుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించండి

చిట్టమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల జీవనోపాధి కోల్పోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ చిట్టమూరులోని కొత్తగుంటలో సోమవారం ఆటో కార్మికులు ధర్నా చేపట్టారు. నాయుడుపేట, మాల్లాం, సూళ్లూరుపేట, కోట వైపు వెళ్లే వాహనాలను గంటసేపు నిలిపివేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు రసూల్, జానీ, అచ్చయ్య, గురవయ్య, వినోద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాళెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... వేముల పాళెం గ్రామానికి చెందిన శివయ్య అనే వృద్ధుడు సైకిల్‌పై గూడూరుకు వెళ్తుండగా పాతసంతరోడ్డు వద్ద ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు వెనుక నుంచి ఢీకొంది. శివయ్యకు గాయాలు కావడంతో స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామని రెండో పట్టణ ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు అన్నారు. సోమవారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంగ కాలువలు ఇలా... నీళ్లు పారేదెలా?

ఓజిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నైకి తాగునీరు, ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించే తెలుగు గంగ ప్రధాన, బ్రాంచి కాలువలు దుస్థితికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఓజిలి మండలంలో 47 చెరువుల కింద సుమారుగా 8వేల ఎకరాలకుపైగా వరి సాగు చేస్తున్నారు. బ్రాంచి కాలువల ద్వారా మండలంలోని అన్ని చెరువులను గంగ నీటితో నింపి పంటలకు అందిస్తున్నారు. అయితే గంగ కాలువలు సరిగా లేకపోవడంతో చెరువులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఏర్పడింది. బ్రాంచి కాలువలు పూడిపోవడం, తుప్పలు, ముండ్ల పొదలు, గడ్డి ఏపుగా పెరిగిపోయి సక్రమంగా నీరు ప్రవహించే పరిస్థితి లేకపోవడంతో రైతులు సాగు నీటికి ఇక్కట్లు పడుతున్నారు. వర్షాభావం నెలకొన్న సమయాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా వుంటుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క చెరువుకూ మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో చెరువుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. కలుజులు, తూములు లీకవుతుండడంతో ఉన్న నీరు వృథా అవుతోంది. దీంతో చెరువులకు చేరిన నీరు పట్టుమని పది రోజులు కూడా ఉండని పరిస్థితి ఉంది. ప్రధానంగా కొండవల్లిపాడు, విజయానెల్లూరు, అత్తివరం, వాజ్జవారిపాళెం, ఇనుగుంట, సగుటూరు, భువనగిరిపాళెం, కురుగొండ, మానమాల, కొత్తచెరువు, పున్నేపల్లి తదితర గ్రామాల్లోని చెరువులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో చివరి తడికి నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గంగ కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం వుంది.



ఓజిలి వద్ద ముళ్ల పొదలతో నిండిన గంగ బ్రాంచి కాలువ

చవితి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



కాళంగి నది వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబు, పక్కనే సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. సోమవారం సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో చవితి ఉత్సవాలకు సంబంధించి ఆర్డీవో, డీఎస్పీ చెంచుబాబు, డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు నిర్వహించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక ప్రతిమల ఏర్పాటుకు రెవెన్యూ, పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో అనుమతి ఇచ్చేలా సంబంధిత తహసీల్దార్లు చొరవ తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని చేయాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీవో, డీఎస్పీ, అధికారులతో వినాయక ప్రతిమల నిమజ్జనం చేసే కాళంగి నదీ ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో జాలిరెడ్డి, సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి తహసీల్దార్లు రవీంద్రనాథ్ రెడ్డి, శరత్‌బాబు, శైలాకుమారి, రాజేంద్ర, హరికృష్ణ, పద్మావతి, సూళ్లూరుపేట, నాయుడుపేట, శ్రీసిటీ, సత్యవేడు సీఐలు మురళీకృష్ణ, బాబి, శ్రీనివాసులు, మురళి, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, స్వప్న, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు అన్నారు. సోమవారం స్థానిక అలవల వారి కల్యాణ మండపంలో అగ్రిగోల్డ్ ఏజెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11సంవత్సరాల నుంచి కట్టిన డిపాజిట్ల కోసం పోరాటం చేస్తున్నా... ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఒంగోలు చేపట్టే నిరసన కార్యక్రమంలో ఏజెంట్లు, బాధితులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని, ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రసాద్, శ్రీనివాసరావు, కందగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు మోదుగుల పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు, వేదికపై ప్రసాద్, శ్రీనివాసరావు, పార్థసారథి, నాగేశ్వరరావు

గురుకులంలో తహసీల్దారు తనిఖీలు



ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న తహసీల్దారు జయజయరావు

కోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను సోమవారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. విద్యార్థుల చేత వంట పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు నేపథ్యంలో గురుకులంలోని వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో పనులు చేయించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో రమణయ్య, వైస్ ప్రిన్సిపాల్ సరిత రోజ్‌లిన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారి తీరుపై విమర్శలు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కులోని గ్రంథాలయ అధికారి తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రంథాలయంలోనే మద్యం సేవిస్తున్నారంటూ సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆయన తీరుపై పాఠకులు విమర్శలు చేస్తున్నారు.

అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోకుంటే చర్యలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోకుంటే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ స్పష్టం చేశారు. సోమవారం ఆమె పట్టణంలోని భరత్‌నగర్‌లో పర్యటించి అక్రమ కొళాయి కనెక్షన్లను గుర్తించి ఆ ఇంటి యజమానులతో మాట్లాడారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా తీసుకున్న కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని, లేనిపక్షంలో కొళాయి కనెక్షన్ తొలగించడమే కాకుండా మున్సిపల్ సేవలను నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది విజయరామయ్య, మోహన్‌కృష్ణ, సంగీత, శ్రీనివాసులు హరి తదితరులు ఉన్నారు.

శ్మశానవాటికలో వసతి గృహం ప్రారంభం



శ్మశానవాటికలో వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న సోల్లేటి శ్రీనివాసులు, కామిరెడ్డి రాజారెడ్డి తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని హిందూ శ్మశానవాటికలో సోల్లేటి శ్రీనివాసులు భార్య ప్రవీణ జ్ఞాపకార్థంగా రూ.4 లక్షలతో అదనపు వసతిగృహాన్ని నిర్మించారు సోమవారం సోల్లేటి శ్రీనివాసులు, స్వర్గధామం కన్వీనర్ కామిరెడ్డి రాజారెడ్డి వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్వర్గధామం కార్యదర్శి మునగాల కృష్ణారావు, సభ్యులు పీడీ ఉదయ శంకర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, శశిధర్, కందనూరు సంజాయ్, రాఘవేంద్ర, జలంధర్, అంకయ్య, నైనప్పగారి కుమార్, కావేరిపాకం అశోక్, యతేంద్ర, మునిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శోభాయాత్ర

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని శోభాయాత్ర నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులను ట్రాక్టర్‌లో ఉంచి శోభాయాత్ర జరిపారు.

జాయింట్ ఎల్‌పీఎంల విభజనకు చర్యలు

పెళ్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాయింట్ ఎల్‌పీఎం సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు హరికృష్ణ తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎం కలిగిన రైతులు గ్రామ సచివాలయాల్లో ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంట కాలువ పనులను పూర్తి చేయండి

పెళ్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు చెరువుకు నీరందించే కాలువ పనులను పూర్తి చేయాలని ఆ గ్రామానికి చెందిన రైతులు తహసీల్దారు హరికృష్ణను కోరారు. జాతీయ రహదారి రోడ్డు నిర్మాణంలో భాగంగా చిల్లకూరు వడ్డిపాళెం వద్ద కొంత దూరం కాలువను పూడ్చివేయడం జరిగిందన్నారు. వర్షాకాలం ప్రారంభం అయినందున చెరువుకు సాగునీరు అందించే కాలువను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకుమార్, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆరూరు బాలాజీ, రమణయ్య, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కోట క్రాస్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం, చిట్టేడు, విద్యానగర్, కోట ప్రాంతాల్లో సోమవారం రవాణాశాఖ అధికారులు ప్రభాకర్‌రావు, శాంతి వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా, అధిక లోడ్‌తో తిరుగుతున్న లారీలు, ట్రాక్టర్లు, ఆటోలను సీజ్ చేసి వాకాడు ఆర్టీసీ డిపో అధికారులకు అప్పగించారు. పలు ద్విచక్ర వాహనదారులకు రూ.80వేల జరిమానా విధించారు.

వాకాడు: మండలంలో పలుచోట్ల వాహనాలను రవాణాశాఖ అధికారులు ప్రభాకర్‌రావు, శాంతి తనిఖీ చేశారు. అగ్రికల్చర్ వాహనాలను కమర్షియల్‌గా ఉపయోగిస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఆదేశించారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్

కోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోటలోని వెలుగు కార్యాలయంలో సోమవారం సెర్ప్ ఆధ్వర్యంలో ఆడిట్ జరిగింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలోని 37 సంఘ బంధాలు, సంఘ మిత్రలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ఆయా పథకాలకు సంబంధించి మంజూరైన నగదు, వినియోగానికి సంబంధించిన రికార్డులను ఆడిటర్లు కార్తీకేయ, నారాయణరెడ్డి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం అనీలా, సీసీలు శ్రీకాంత్, భాస్కర్, ప్రసాద్, అలివేలమ్మ, శంకర్, బిందు, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే ప్రారంభం

తడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వామిత్వ సర్వే సోమవారం ప్రారంభమైంది. తడకండ్రిగ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో సర్వేను ప్రారంభించారు. ప్రతి ఇంటిని సర్వేచేసి వాటికి హక్కుదారు పత్రాలను మంజూరు చేస్తామని పంచాయతీ కార్యదర్శి గాబ్రియల్ చెప్పారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించండి

తడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా మూడు సెంట్లు భూమి ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని కోరారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, కుమార్, చల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులందరూ కేవైసీ చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ఉన్నికృష్ణన్

గూడూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులందరూ తప్పనిసరిగా కేవైసీని అప్‌డేట్ చేయించుకోవాలని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఉన్నికృష్ణన్ సూచించారు. సోమవారం మండలంలోని రామలింగాపురంలో ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు ప్రతి ఖాతాదారుడు తమ ఆధార్, పాన్‌కార్డు, ఫోన్ నెంబర్ వివరాలను బ్యాంకుకు అందజేసి కేవైసీని అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఆర్‌బీఐ సూచనల మేరకు ప్రతి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించి ఖాతాదారులను చైతన్య పరిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జడ్ఎం బంగారురాజు, ఎల్‌డీఎం రవికుమార్, సీనియర్ బీఎం బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వెలగని వీధి లైట్లు

పొద్దుపోతే బయట తిరగలేక జనం ఇక్కట్లు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో 25 వార్డులు ఉండగా ప్రతి వార్డులోనూ కొన్నిచోట్ల వీధి లైట్లు వెలగడంలేదు. ప్రధానంగా సుదర్శన్ నగర్, నరసింహరావు వీధి, హనుమాన్ నగర్, తోలిమిట్ట, బొగ్గులమిట్ట తదితర ప్రాంతాల్లో వీధి లైట్లు లేక పొద్దుపోతే చీకటి అలుముకుంటోంది. మున్సిపాలిటీ సిబ్బంది వీధి దీపాల నిర్వహణ గురించి పూర్తిగా పట్టించుకోవడంలేదని, పలుమార్లు అధికారులకు తెలియజేసినా స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే మొన్ననే కదా కొత్త లైట్లు వేసింది.. అప్పుడే పోయాయా అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లోపించిన లైట్లు కొనుగోలు చేయడంతో, అవి మూన్నాళ్లకే చెడిపోతున్నాయని విమర్శిస్తున్నారు. వీధి దీపాల నిర్వహణ గురించి పలుమార్లు కౌన్సిల్‌లో ప్రశ్నించినా అధికారులు స్పందించడం లేదని కౌన్సిలర్లు మండపడుతున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీలలో 530కి పైగా ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 5వ తరగతిపైన, పదవ తరగతి, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత అయిన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బుధవారం స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉంటుందని, మరిన్ని వివరాలకు 9985056929, 8639835953లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు దేవేందర్‌రెడ్డి, శివశంకర్‌నాయక్, సుధారాణి, రోజ్మాండ్, డీఆర్‌డీఏపీడీ శోభన్‌బాబు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం పాల్గొన్నారు. కాగా, ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న దోమల నివారణ దినోత్సవానికి సంబంధించిన బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థి ఎంపిక



జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన చరిత్

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్‌పీపీ పాఠశాలకు చెందిన విద్యార్థి చరిత్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. 9వ తరగతి చదువుతున్న చరిత్ ఈనెల 11నుంచి 15వ తేదీ వరకు తమిళనాడులో జరిగిన సౌత్‌జోన్ సీబీఎస్ఈ ఆర్చరీ పోటీల్లో ప్రతిభచాటి సిల్వర్ మెడల్ సాధించారన్నారు. పంజాబ్‌లో సెప్టెంబరు 20నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీబీఎస్ఈ ఆర్చరీ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక సాయివిద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్ఎం దయాకర్ తెలిపారు. ఒంగోలులో ఈనెల 17వ తేదీన నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మోక్షిత్ అండర్-12 విభాగంలో, గృష్నేశ్వర్ అండర్-14 విభాగంలో ప్రతిభచాటి ద్వితీయ బహుమతులను సాధించారని తెలిపారు.



ఓపెన్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చెత్తకు బదులు సరుకులు

● తారకరామనగర్ పంచాయతీలో స్వచ్ఛ రథం ప్రారంభం



స్వచ్ఛ రథంలో చెత్తను సేకరించి తూకం వేస్తున్న డీపీవో సుశీలాదేవి

రేణిగుంట ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రీసైక్లింగ్‌కు ఉపయోగపడే పొడి చెత్త, ఇనుము, పేపర్లు, ప్లాస్టిక్, అట్టపెట్టెలు, బాటిళ్ల తదితరాలు తీసుకుంటారు. తూకంవేసి ఆ విలువ ప్రకారం సరుకులు ఇస్తారు. లేదంటే డబ్బులు చెల్లిస్తారు. దీనికోసం 'స్వచ్ఛరథం'ను జిల్లాలోనే మొదటిసారిగా ప్రయోగాత్మకంగా రేణిగుంట మండలం తారకరామనగర్ పంచాయతీలో సోమవారం సాయంత్రం డీపీవో సుశీలాదేవి ప్రారంభించారు. గతలో ఇంటింటికి రేషన్ పంపిణీకి వినియోగించిన వాహనాన్ని స్వచ్ఛరథంగా వినియోగిస్తున్నారు. స్థానిక పంచాయతీ నిధుల నుంచి డ్రైవరుకు రూ.25 వేల జీతం చెల్లిస్తారు. షెడ్యూల్ ప్రకారం.. ప్రాంతాలవారీగా స్వచ్ఛ రథం తిరుగుతూ ప్రజల నుంచి చెత్తను సేకరిస్తుంది. స్థానికంగా ఉండే ప్రజలు రోడ్లు, కాలువల్లో, పరిసరాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు స్వచ్ఛ రథం పథకాన్ని అమలు చేస్తున్నట్లు డీపీవో తెలిపారు. 'ఈ చెత్త ద్వారా డబ్బు వస్తుందని తెలిస్తే గృహిణులు బయట వేయకుండా, ఒకచోట ఉంచి ఇస్తారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే డ్రైనేజీల్లో చెత్త లేకుండా, ఊరంతా శుభ్రంగా కనిపిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈశ్వరమ్మ, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారి షణ్ముఖరామ్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, కిషోర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, టీడీపీ బుజ్జి నాయుడు, బాలాజీ, మునిరాజా, వాసు, జైచంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. కనీసం పదేళ్ల అనుభవమున్న ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ తత్సమాన కేటగిరీ వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ప్రతిపాదనకు సంబంధించిన రెండు కాపీలను ఈనెల 24లోపు ఉప విద్యాశాఖాధికారులకు సమర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సెక్టోరల్, సహాయ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరల్, సహాయ సెక్టోరల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 23లోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో ఉపాధ్యాయులు అర్హులన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా కనీసం ఐదేళ్ల సర్వీసు లేదా సెకండరీ గ్రేడ్ టీచర్‌గా 8ఏళ్ల సర్వీసు కలిగి 55 సంవత్సరాల వయసు మించనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భక్తులను మోసగించే వారిపై కేసులు పెడతాం



దళారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భక్తులను మోసగించే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. ముక్కంటి ఆలయం వద్ద దళారులుగా వ్యవహరిస్తూ భక్తులతో మాట్లాడుతున్న ఏడుగురిని ఆయన అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. భక్తులకు మాయమాటలు చెప్పి మోసగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు.

తిరుమలలో వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని రూ.90 వేల స్వాహా

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరు దళారులపై హైదరాబాద్‌కు చెందిన భక్తుడు టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. 12 మందికి దర్శనం ఏర్పాటు చేస్తానని చెప్పి గతేడాది ఆగస్టు 16న వనం నటరాజ నరేంద్రకుమార్, కేఎస్ నటరాజ శర్మ రూ.90వేలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత స్పందించలేదని తెలిపారు. కాగా ఈ ఇద్దరు దళారులు హైదరాబాద్‌లో పలువురిని ఇలాగే మోసం చేస్తున్నారని విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఇప్పటికే వీరిపై 12 కేసులు నమోదయ్యాయని తెలిసింది. దీంతో దర్శనం, వసతి కోసం దళారులను ఆశ్రయించవద్దంటూ టీటీడీ మరోమారు భక్తులకు ఒక ప్రకటనలో సోమవారం విజ్ఞప్తి చేసింది. అనుమానస్పదం అనిపిస్తే 0877 2263828 నెంబరు ద్వారా విజిలెన్స్ అధికారులను సంప్రదించాలని సూచించింది.





పెరిమిటిపాడు చెరువులో తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గుంతలు - చెరువు మట్టిని రాత్రివేళలో సూళ్లూరుపేటకు తరలిస్తున్న ట్రాక్టర్లు

మట్టి తవ్వేందుకు ఎక్స్‌కవేటర్లు. తరలించేందుకు ట్రాక్టర్లుంటే చాలు. ఇవన్నీ అద్దెకే వస్తాయి. అంతకు మించి పెట్టుబడి అవసరం లేదు. 'పవర్' చూపుతూ, అధికారులను 'మ్యానేజ్' చేసుకుంటూ రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతోంది మట్టి మాఫియా.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

చెరువులు తవ్వి.. రాత్రి వేళల్లో అక్రమంగా మట్టి తరలింపు

నిన్నా మొన్నటి వరకు.. నువ్వెంతంటే నువ్వెంతంటూ కత్తులు దూసుకున్నారు. ఇప్పుడు అధికార, ప్రతిపక్ష నేతల్లోని కొందరు ఒక్కటై మట్టి తవ్వేస్తున్నారు. సూళ్లూరుపేట మండలంలోని కుదిరి కొత్త చెరువు, పెద్ద చెరువు, పెరిమిటిపాడు చెరువు, తడ మండలంలోని



కుదిరి కొత్త చెరువులో మట్టిని తవ్వేసిన దృశ్యం

కారిజాత చెరువులను రోజూ యంత్రాలతో తవ్వి.. పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలించి విక్రయిస్తున్నారు. చీకటి పడితే చాలు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు చెరువుల్లోకి క్యూ కడతాయి. సూళ్లూరుపేట పట్టణంలోని ఇళ్ల ప్లాట్లు, సమీపంలోని వెంచర్లకు, కొత్తగా ఏర్పాటుచేసే పరిశ్రమలకు మట్టి తరలిస్తున్నారు. కుదిరి చెరువులో రాత్రి 10 గంటలైతే చాలు జాతరను తలపించేలా యంత్రాలు, ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నాయి. దావాదిగుంట, షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం మీదుగా రాత్రివేళల్లో రయ్..రయ్ అంటూ మట్టి ట్రాక్టర్లు వేగంగా దూసుకెళ్తున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న నివాసాలు ఉండే ప్రజలు సైతం ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పెరిమిటిపాడు చెరువులో వారం రోజుల నుంచి మట్టిని తవ్వి సమీపంలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నారు. ఇక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు ఒక్కటై చెరువుతో పాటు పక్కనే ఉన్న జగనన్న లే అవుట్, ఫారెస్టు భూముల్లో కూడా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ ప్రాంతంలో దొరికే మట్టికి మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కులకు వరంగా మారింది. ఈ చెరువులో పక్కనే ఉన్న దేవాలయానికి రోడ్డు వేసేందుకు మట్టిని తోలుకుంటున్నామని చెప్పి పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తున్నారు. కొంతమంది నాయకులు



అటవీ భూముల్లో తవ్వేసిన మట్టి

ప్రతీ ట్రిప్పునకు రూ.100 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇంతలా మట్టి తవ్వేస్తున్నా.. రాత్రిళ్లు ట్రాక్టర్లు తెగ తిరుగుతున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడంలేదు.

తలకోన ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

ఎర్రావారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంగళవారం ఉదయం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ భూమి పూజ చేశారు. ఈ ఆలయ అభివృద్ధికి టీటీడీ రూ.18 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఏడాదిలోపు ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించామని బీఆర్ నాయుడు తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో సుందరంగా ఈ ఆలయ పునర్నిర్మాణంతో పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే నాని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు శాంతారావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, తలకోన ఆలయ ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న బీఆర్ నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

మంగళం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు సోమవారం బోనుకు చిక్కింది. నెల రోజులుగా వర్సిటీ పరిసర ప్రాంతాల్లో శునకాలను వేటాడుతూ జూపార్కు రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేసింది.

నెలరోజులు వణికించి బోనుకు చిక్కిన చిరుత



దీనిపై స్పందించిన అటవీ శాఖ అధికారులు చిరుత సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించారు. యూనివర్సిటీలో చిరుత సంచరిస్తున్న మూడు ప్రాంతాల్లో మూడు బోన్లను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు వర్సిటీలోని ఆడిటోరియం వద్ద గల అన్నపూర్ణ క్యాంటీన్ వెనుక వైపు ఏర్పాటు చేసిన బోనుకు చిరుత చిక్కింది. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడ్డ మగ చిరుత వయసు మూడు సంవత్సరాలు ఉంటుందని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చిరుతను సురక్షితంగా సుదూర అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు ఆయన తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీసీ విజయశేఖర్

29 బార్లకు నోటిఫికేషన్

- గతంతో పోలిస్తే రెండు అదనం
- దరఖాస్తుకు 26వ తేది గడువు
- ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ వెల్లడి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 29 బార్ల ఏర్పాటుకు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. గతంలో టూరిజం విభాగం బార్‌తో కలిపి 27 ఉండగా.. ఈసారి సూళ్లూరుపేట, తిరుపతి పరిధిలో రెండు అదనంగా ఏర్పాటు చేయనున్నారు. తిరుపతిలో 17, శ్రీకాళహస్తిలో మూడు, పుత్తూరులో ఒకటి, చంద్రగిరి టూరిజం కింద ఒకటి, గూడూరులో మూడు, సూళ్లూరుపేటలో రెండు, వెంకటగిరి, నాయుడుపేటలో ఒక్కోటి చొప్పున 29 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్, ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం వీరు నూతన ఎక్సైజ్ పాలసీపై మీడియాతో మాట్లాడారు. 'ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో 26న సాయంత్రం 5 గంటల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో https://oc.hpfs project.com ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు చేస్తేనే లాటరీ ద్వారా లక్కీ డిప్ తీసి లైసెన్సు కేటాయిస్తారు. ఒక్కో దరఖాస్తుకు నాన్ రీఫండబుల్ ఫీజు కింద రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10 వేలు చెల్లించాలి. ఈ దరఖాస్తులను 28న కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి అర్హులకు బార్లు కేటాయిస్తాం. సెప్టెంబరు ఒకటి నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుంది' అని వారు అని వివరించారు.

అప్పుడు వేలం.. ఇప్పుడు లాటరీ

ఈ బార్ల కేటాయింపునకు వైసీపీ ప్రభుత్వం వేలం పాట నిర్వహించగా, కూటమి ప్రభుత్వం లాటరీ విధానాన్ని అనుసరిస్తోంది. గతంలో ఈ- వేలం పాటల్లో రూ.కోటి వరకు పలికిన ఒక్కో బార్ లైసెన్సు.. ఈ సారి కొత్త పాలసీ ప్రకారం లాటరీ ద్వారా రూ.55 లక్షలకే దక్కనుంది.

'గీత' కార్మికుల బార్లకు రేపు నోటిఫికేషన్

జిల్లాలో 'గీత' కార్మికుల కోసం మూడు బార్లు కేటాయించారు. వీటికి 20వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇందులో తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఈడిగ సామాజికవర్గానికి ఒకటి, శ్రీకాళహస్తి, గూడూరులో గౌడలకు ఒక్కోటి చొప్పున బార్లను కేటాయించారు.

జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం





క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేస్తున్న రవినాయుడు, రజని - వెయిట్ లిఫ్టింగ్

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో సోమవారం అమరావతి చాంపియన్‌షిప్-2025 జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని, రాష్ట్రవ్యాప్తంగా మూడు దశలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి పోటీలు ముగియగా, జోనల్‌స్థాయి పోటీలు మొదలయ్యాయి. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల నుంచి 1,700 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కానున్నారు. ఈ పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఎన్డీయే ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి పాఠశాలకూ రూ.30వేలతో క్రీడా సామగ్రి అందజేస్తున్నామన్నారు. క్రీడాకారులు ఆటల్లో రాణించి పతకాలు సాధించాలని శాప్ డైరెక్టర్ రజని కోరారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఏపీ జీబీసీ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఎస్వీయూ ఎస్ఐ కృష్ణయ్య, డీఎస్‌డీవోలు శశిధర్, బాలాజీ, ఉదయ్, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి బాస్కెట్ బాల్, ఖోఖో, పరుగుపందెం, వెయిట్ లిఫ్టింగ్ తదితర పోటీలు జరిగాయి.



బాస్కెట్‌బాల్ పోటీలు

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

● ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీస్

తిరుచానూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ హెడ్‌కానిస్టేబుల్ సస్పెండయ్యారు. మరో ముగ్గురు పోలీస్ అధికారులకు షోకాజ్ నోటీసు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్ (ఎమ్మెల్యే నాని నివాసం) సమీపాన ఐదు రోజుల కిందట రాత్రి వేళ ఓ వ్యక్తి వచ్చాడు. కుటుంబ సభ్యులతో వివాద నేపథ్యంలో అతడు ఆత్మహత్య చేసుకునేందుకు పెట్రోలు బాటిల్ తెచ్చుకున్నాడు. కాసేపు హడావిడి చేశాడు. అక్కడి భద్రతా సిబ్బంది గమనించి అతడి ప్రయత్నాన్ని నివారించారు. వెంటనే తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయగా, హెడ్‌కానిస్టేబుల్ సుజాత సరైన రీతిలో స్పందించలేదు. ఆ ప్రాంతం తమ పరిధికాదని,ఎమ్మార్‌పల్లి స్టేషన్ అంటూ నిర్లక్ష్యంగా బదులిచ్చారు. ఈ విషయాన్ని పోలీస్ అధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లినట్లు తెలిసింది. విచారించిన అధికారులు రెండు రోజుల క్రితం సదరు హెడ్‌కానిస్టేబుల్ సుజాతను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ముగ్గురు అధికారులకూ షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.



గౌతమ్‌రాజు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, సినీ ప్రముఖుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, సీఎం సోదరి హైమావతి, సినీనటుడు గౌతమ్ రాజు, తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఉన్నారు.



ఆదిశేషగిరిరావు, హైమావతి

ఘాట్‌రోడ్డు పనుల పరిశీలన

తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఘాట్ రోడ్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్‌రోడ్డు సుందరీకరణకు, శుభ్రతకు పలు సూచనలు చేశారు.




ఘాట్‌రోడ్డులో ఈవో శ్యామలరావు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 86,364
తలనీలాలు సమర్పించినవారు: 30,712



అందాల విందు

ఫోటో అంటే సమాజానికి అద్దం కాదు, అర్థం. దృశ్యానికి ఛాయాచిత్రకారుడు చేసే కవితాత్మక వ్యాఖ్యానం. నమోదయ్యే ఒక చరిత్ర. కూలిన గోడ.. ఆశ్రయమిచ్చే నీడ.. రాలే చినుకు.. పేవ్‌మెంట్‌మీద కునుకు.. విరిసిన పువ్వు.. పసికందు నవ్వు.. కాదేదీ ఫొటోకనర్హం. శేషాచలం ఫొటోగ్రాఫర్లకు ఖజానా. ఆకుపచ్చని అందాలే కాదు.. పాకే పురుగు, ఎగిరే పిట్ట, దూకే జలపాతం.. సమస్తమూ ఛాయాచిత్రవస్తువే. అందుకు సచిత్ర సాక్ష్యమే ఈ ఫొటోలు. చిత్తూరు, తిరుపతి నగరాల్లో, తిరుమల కనుమ దారుల్లో తీసిన ఫొటోలు ఇవి. వాన కురిసే వేళ చిత్రవిచిత్రమైన బుల్లి జీవజాలాన్నీ, పర్యాటక ప్రదేశంలోని జనజీవితాన్నీ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ఫొటోల విందు ఇది..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, తిరుపతి, తిరుమల, చిత్తూరు





ఎదురు చూపులు





చీమల వంతెన



దిగులు వానలు



పహారా



బుల్లి వింత జీవుల లోకం



లోపల ఏముందో







తడిచిన బతుకులు











స్వామిదే.. భారం!





పార్టీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారు?

● కలెక్టర్, ఎస్పీలకు సత్యవేడు ఎమ్మెల్యే ఫిర్యాదు

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారంటూ సస్పెన్షన్‌లో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా తాను అభివృద్ధి పనులను ప్రారంభించాక, ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టాక మరొకరు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా తాను పాల్గొనే కార్యక్రమాల్లో ఎవరైనా పాల్గొనవచ్చు గానీ విడిగా కార్యక్రమాలు చేయడమేమిటని ప్రశ్నించారు. ఇది ప్రొటోకాల్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆరోపించారు. పార్టీ కో ఆర్డినేటర్ ప్రైవేటు కార్యక్రమాలకు హాజరైనా మండల స్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. తన ఫిర్యాదుపై స్పందించకుంటే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అందరూ భాగస్వాములై నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: సత్యవేడులో టీడీపీ కో ఆర్డినేటర్‌కు పోలీసు విభాగం తరఫున ప్రొటోకాల్ ఎలా కల్పిస్తారని ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీ హర్షవర్ధరాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన పెళ్లిళ్లు, ఆలయాలకు వెళుతున్నా మీ పోలీసులు వెంట వెళుతున్నారని చెప్పారు. దీనిపై పరిశీలించి ఎలా చేయాలో అలా చేస్తానని ఎస్పీ చెప్పారు.

ప్రహరీ దూకి.. సీసీ కెమెరాలు పగులకొట్టి

● టీటీడీ సూపరింటెండెంట్ ఇంట్లో చోరీ

● 220 గ్రాముల నగలు, 460 గ్రాముల వెండి వస్తువుల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రహరీ దూకారు. ఆధారాలు దొరక్కుండా సీసీ కెమెరాలు పగులకొట్టారు. టీటీడీ (తిరుమల వైకుంఠం-1) సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఇంట్లో దొంగలు పడి 220 గ్రాముల బంగారు నగలు, 460 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. తిరుపతి క్రైం సీఐ ప్రకాష్‌బాబు తెలిపిన ప్రకారం.. తిరుపతి బైరాగిపట్టెడలో నివాసం ఉంటున్న టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఈనెల 14న హైదరాబాదులోని కుమార్తె ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తిరిగి ఇంటికి రాగా.. తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో అనుమానం వచ్చింది. బీరువాలో చూడగా బంగారు నగలు, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గిరిధర్, క్రైం సిబ్బంది సంఘటనా స్థలం పరిశీలించారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావుకు సమాచారం ఇచ్చారు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, సీఐలు చిన్నపెద్దయ్య, ప్రకాష్‌బాబు, ఐడీ పార్టీలు, వేలి ముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్‌లు ఇంట్లో పరిశీలించాయి. వేలి ముద్రలు సేకరించారు.

ఇంట్లోనే బీరువా తాళాలు

హైదరాబాదుకు వెళ్లే సమయంలో శ్రీనివాసులు కుటుంబీకులు రెండు బీరువాలకు తాళాలు వేసి అక్కడే ఉంచారు. దీంతో దొంగలు ఆ తాళాలు తీసుకుని బీరువా తలుపులు తీసి 220 గ్రాములు బంగారు నగలు, 460 గ్రాములు వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. ఆ తాళాలూ తమతో పాటే వారు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు పగులకొట్టినా, వీధిలోని సీసీ కెమెరాల ఆధారంగా క్రైం పోలీసులు పుటేజీలను పరిశీలించారు. దొంగలు ఆటోలో వచ్చి.. వెళ్లినట్లు గుర్తించారు. నిందితుల ముఖాలు గుర్తు పట్టినట్లు విశ్వసనీయ సమాచారం. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న క్రైం డీఎస్పీ

పింఛను తొలగిస్తామంటున్నారు

అధికారుల ఎదుట బోరుమన్న దివ్యాంగులు - కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 238 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మేమంతా దివ్యాంగులం... ఇదే సదరం సర్టిఫికెట్లతో ఎన్నో ఏళ్లుగా పింఛను పొందుతున్నాం. ఇప్పుడేమో అనర్హులంటూ అధికారులు నోటీసులు పంపిస్తున్నారు అంటూ పలువురు దివ్యాంగులు అధికారుల ఎదుట బోరుమన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 238 వినతులు వచ్చాయి. అందులో భూసమస్యలపైనే 130 వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ అర్జీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పింఛను నిలిపేస్తే ఎలా బతకాలి?



నేను దివ్యాంగురాలిని. నడవలేని పరిస్థితిలో ఉన్నాను. వెరిఫికేషన్ పేరుతో సదరంలో వికలత్వం తక్కువ శాతం ఉందని పింఛను ఇవ్వమని అధికారులు అంటున్నారు. ఇది చాలా అన్యాయం. వీల్‌చైర్ లేకుండా నడవలేను. పింఛను లేకపోతే నేను ఎలా బతకాలి చెప్పండి.

- అరుణ, ఎస్‌కేడీనగర్, తిరుపతి

దివ్యాంగుల కోటాలో ఉద్యోగం ఇప్పించండి



అయ్యా నేను మనిషి సాయం లేకుండా నడవలేను. ఎంబీఏ వరకు చదివాను. దివ్యాంగుల కోటాలో ఉపాధి కల్పిస్తే ఆధారంగా ఉంటుంది. సాయం చేయండి.

- సాయి భాస్కర్, శ్రీకాళహస్తి

శంకరంబాడి విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయండి

మహాకవి శంకరంబాడి సుందరాచారి విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయండి. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయన విగ్రహాన్ని లక్ష్మీపురం సర్కిల్‌లో వంతెన కిందకు మార్చారు. అయితే విగ్రహానికి పూలమాల వేయాలన్నా, నివాళులు అర్పించాలన్నా ఇబ్బందికరంగా ఉంది. అలాగే శిలాఫలకంలో అక్షర దోషాలు సరిచేయండి.

- మస్తానమ్మ, అధికార భాషా సంఘం, మాజీ సభ్యురాలు

పుట్టుకతోనే వికలాంగుడిని



నేను పుట్టుకతోనే వికలాంగుడిని. ఏ పనీ చేసుకోలేను. ఎంతో కాలంగా పింఛను తీసుకుంటున్నాను. అయితే వికలత్వం తక్కువగా ఉందని పింఛను నిలిపివేస్తున్నామంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. 70శాతానికి పైగా ఉన్న వికలత్వంతో ఎడమకాలితో నడవలేను. పింఛను నిలిపేస్తే బతకలేను.. న్యాయం చేయండి.

- ఆర్ముగం, వేదాంతపురం, తిరుపతి రూరల్

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తొలగించండి

వెంకటగిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును తొలగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు, కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఆర్.లక్ష్మి సంఘీభావం ప్రకటించారు. సమస్యలు పరిష్కరించాలని 60 రోజులుగా కార్మికులు దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. పదేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఒకే స్థానంలో కూర్చుని కార్మికులను వేధిస్తున్నాడని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అన్నారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వెంకటగిరి మున్సిపల్ వర్కర్స్

తుడా పార్కు స్థలం అన్యాక్రాంతమవుతోంది

తిరుపతి రూరల్ రామానుజపల్లి ఉద్యోగనగర్ కాలనీలో తుడా అప్రూవల్ వెంచర్‌లో పార్కు స్థలం అన్యాక్రాంతమవుతోంది. ఆ స్థలంలో మొక్కలు నాటి మౌలిక వసతులు కల్పించాలి.

- బుజ్జిబాబు, రామానుజపల్లి, తిరుపతి రూరల్

మసీదు స్థలాన్ని కాపాడండి

దుర్గసముద్రం జగనన్న కాలనీలో గత ప్రభుత్వం మసీదు కోసం ఇచ్చిన పది సెంట్లను కొందరు ఆక్రమించుకునే ప్రయత్నిస్తున్నరని పలువురు మైనార్టీలు జేసీ శుభం బన్సల్‌ను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషను కల్పించాలని బీఎస్పీ నేతలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 520	

రైతు, ప్రజా సంఘాల నాయకుల అరెస్టు దారుణం

ఉలవపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు సోమవారం తలపెట్టిన చలో కరేడు కార్యక్రమానికి తరలివస్తున్న రైతు, ప్రజాసంఘాల నేతలను పోలీసులు కరేడు ర్యాంపు వద్ద అక్రమంగా అరెస్టు దారుణమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్, అఖిలభారత రైతుకూలి సంఘం జిల్లా అధ్యక్షుడు నాంచార్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్‌లు ఖండించారు. అక్రమంగా అరెస్టు చేసిన ప్రజా సంఘాల నేతలను వెంటనే విడుదల చేయాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అరెస్టు చేసి పక్క మండలాల పోలీస్ స్టేషన్‌కు తరలించినవారిలో పీడీఎస్‌యూ నాయకులు రాజశేఖర్, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, రైతుకూలి సంఘం నాయకులు కేశవరావులు ఉన్నారని తెలిపారు.

న్యూస్ బాక్స్

సచివాలయంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

వలేటివారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కళవళ్ల గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధుల్లో సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మృతురాలి కుటుంబానికి ఇంటూరి పరామర్శ

లింగసముద్రం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్ కోటకు చెందిన పాటిబండ్ల మాల్యాద్రి తల్లి వరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆ గ్రామానికి వెళ్లి వరమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంకాయలపాటి మల్యాద్రి, బోయిళ్ల కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కి అధికారుల డుమ్మా


ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వలేటివారిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హౌసింగ్ ఏఈ, డిప్యూటీ తహసీల్దారు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతీ సోమవారం ఈ కార్యక్రమానికి ఒకరిద్దరు అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. అయినప్పటికీ గైర్హాజరైన అధికారులపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దీంతో అధికారులు డుమ్మా కొట్టడం పరిపాటిగా మారింది. సమస్యలపై వచ్చిన అర్జీదారులు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

'ఐడియాథాన్' గోడపత్రిక ఆవిష్కరణ

కావలి(టౌన్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐడియాథాన్ కార్యక్రమం గోడపత్రిక ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ కృత్రిమ మేధను ఉపయోగించి అంతరిక్ష పరిశోధనలో ఏ విధమైన ప్రగతి సాధించవచ్చు అనే అంశంపై విద్యార్థుల సృజనాత్మకత, నూతన ఆలోచనలు ఆవిష్కరణలు ప్రదర్శించే అవకాశం ఐడియాథాన్ ద్వారా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 23న జరుగుతుందని విశ్వోదయ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ తెలిపారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సునీల్ కుమార్, శ్రీనాథ్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల ప్రజలు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రజనీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19న ఇస్కపల్లి-1, 20న ఇస్కపల్లి-2, 21న పడమర గోగులపల్లి, 22న తూర్పు గోగులపల్లి, 23న నార్తుఆములూరు, గ్రద్దగుంట, 28న బీరంగుంట, బట్రకాగొల్లు, 29న పురిణి, 30న ఇందుపూరు గ్రామ సచివాలయాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. 5 నుంచి 15 ఏళ్ల పైబడిన బాలల ఆధార్ కార్డుల్లో మార్పు చేర్పులు చేసుకొనుటకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవ కోసం అధికారులను సంప్రదించాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఈనెల 20వ తేదీ లోపు సంప్రదించాలని మండల వ్యవసాయశాఖాధికారి కేవీ శేషారెడ్డి సోమారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

భూమ్.. ఫట్!

- యథేచ్ఛగా వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా
- ఏళ్ల తరబడి జామాయిల్, పొగాకు సాగు
- పలుచోట్ల కౌలుకు ఇస్తూ లబ్ధి..
- విద్యుత్ కనెక్షన్లు తీసుకుని దర్జాగా బోర్ల ఏర్పాటు


తిమ్మారెడ్డిపాలెంలో దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసిన పంచాయతీ గ్రేజింగ్ భూములు

లింగసముద్రం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు దురాక్రమణలకు గురవుతున్నాయి. ఈ భూములలో జామాయిలు, పొగాకు, పొగనారు, వరి, మిరప పంటలు దర్జాగా సాగు చేస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొన్ని గ్రామాల్లో పశువుల మేత, పంచాయతీ పోరంబోకు భూములు, అసైన్‌మెంటు, గయాలు, వాగు, రోడ్డు పోరంబోకు భూములు ఆక్రమించి కొందరు పైర్లు సాగు చేస్తున్నారు. మరికొందరు ఆక్రమించిన భూములను ఏకంగా ఇతరులకు కౌలుకిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆక్రమణదారులు దుక్కులు దున్ని పైర్ల సాగుకు సమాయత్తమవుతున్నారు.

● దర్జాగా ఆక్రమణలు

మండలంలోని వెంగళాపురంలో సర్వే నెంబర్లు 155/1, 2లలోని 150 ఎకరాలలో సుమారు 100 ఎకరాలను కొందరు ఆక్రమించి పైర్లు సాగు చేస్తున్నారు. వీరిలో కొందరు తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం, వలేటివారిపాలెం గ్రామాలకు చెందిన కొందరికి కౌలుకు ఇచ్చారు. దర్జాగా బోర్లు కూడా వేసి విద్యుత్ కనెక్షన్లు కూడా తీసుకొని పంటలు సాగు చేస్తుండడం గమనార్హం. అలాగే లింగసముద్రంలోని పంచాయతీ గ్రేజింగు భూములలో సుమారు 600 ఎకరాలలో దాదాపు 150 ఎకరాలకు పైగా ఆక్రమించారు. తాజాగా తిమ్మారెడ్డిపాలెంలోని సర్వే నెంబరు 1లోని 512 ఎకరాల పంచాయతీ భూములలో 200 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారుల కళ్లకు కనిపించదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

● యథేచ్ఛగా పంటల సాగు

ఇక ఆర్‌ఆర్ పాలెంలోని సర్వే నెంబరు 255 నుంచి 313 వరకు గల 790 ఎకరాల కండేవారి బీడులో దాదాపు 200 నుంచి 250 ఎకరాల ప్రభుత్వ అసైన్‌మెంటు భూముల్లో ఏళ్ల తరబడి పొగాకు, జామాయిల్ సాగు చేస్తున్నారు. వీరంతా మొగిలిచెర్లకు చెందిన వారు. వీరు ఒక్కొక్కరు 5 నుంచి 40 ఎకరాలకు వరకు ఆక్రమించి జామాయిల్ సాగు చేస్తున్నారు. తాజాగా కొందరు వర్షాలు పడుతుండడంతో దుక్కులు దున్ని జామాయిల్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. మొగిలిచెర్లలో సుమారు 200 ఎకరాలు, పెంట్రాలలో 50 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి పైర్లు సాగు చేస్తున్నారు. ముత్యాలపాడు రెవెన్యూలో ముత్యాలపాడు, పెదపవని గ్రామాల్లో 2200 ఎకరాల ప్రభుత్వ భూమిలో 800 నుంచి 1000 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ కొందరు ఆక్రమణదారులు భూములు ఆక్రమించడం, నకిలీ పట్టాలు, పాస్ పుస్తకాలు సృష్టించి, కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకొంటున్నారు. దీంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే 2012, 2022లో రెవెన్యూ అధికారులు సర్వే చేసి సుమారు 8 వేల ఎకరా ల్లో 3 వేల ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కబ్జా భూములను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఆర్‌ఆర్‌పాలెం కండేవారి బీడులో ఆక్రమిత భూమిలో జామాయిల్


వెంగళాపురంలోని పోరంబోకు భూమిలో వేసిన బోరు



గ్రావెల్, మట్టి వ్యాపారాలకు అనుమతులు ఇవ్వలేదు

● పీఎం ఖాన్, డీఈ, జలవనరుల శాఖ, కావలి

కావలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కావలి డివిజన్‌లో గ్రావెల్, మట్టి వ్యాపారాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. రైతుల అవసరాల కోసం కావలి మండలంలో మూడు చెరువుల్లో నుంచి మట్టి తోలకానికి అనుమతులిచ్చాం. దానిని రైతుల పొలాలకు మాత్రమే ఉపయోగించుకోవాలి. వ్యాపారం చేసినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ కావలి డీఈ పీఎం ఖాన్ తెలిపారు.

? కావలి డివిజన్‌లో గ్రావెల్ తవ్వుకునేందుకు ఎవరికైనా అనుమతులు ఇచ్చారా.

! గ్రావెల్ తోలుకునేందుకు జలవనరులశాఖ ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు.

? మట్టి తోలకాలకు ఏమైనా అనుమతులు ఇచ్చారా.

! కావలి మండలంలోని కావలి పెద్ద చెరువు, తాళ్లపాలెం చెరువు, మన్నెంగిదిన్నె చెరువులలో మట్టి తోలకానికి రైతులుకు అనుమతులు ఇచ్చాం.

? మట్టి తోలుకున్నందుకు రైతులు క్యూబిక్ మీటరుకు ఎంత చెల్లిస్తారు.

! క్యూబిక్ మీటరుకు రూపాయి మాత్రమే చెల్లిస్తారు. ఆ మట్టిని రైతుల పొలాలకు వినియోగించుకోవాలి.

? రైతుల పొలాలకు కాకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఆ మట్టిని వాడుకోవచ్చా.

! రైతుల అనుమతుల మీద తీసుకున్న మట్టిని ఎలాంటి వ్యాపార అవసరాలకు వాడకూడదు. అలా వాడితే వారిపై చర్యలు తీసుకుంటాం.

సనాతన ధర్మ పరిరక్షణలో భాగమే

ఆలయాల అభివృద్ధి

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి


నార్తుమోపూరులో ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి పూలమొక్క అందజేస్తున్న నిర్వాహకులు

అల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి సనాతన ధర్మ పరిరణలో ఒక భాగమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నార్తుమోపూరులో ఉన్న పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రేబాల కోదండరామిరెడ్డి చారిటీస్ నూతన పాలకవర్గాన్ని, ఇందుపూరులో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గాల ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రేబాల కోదండరామిరెడ్డి చారిటీస్ ట్రస్ట్ చైర్మన్‌గా రేబాల కిషోర్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలుగా మేడా సుదివ్య, బట్టమేకల కొండమ్మ, పొన్నెగంటి శ్రీనివాసులు, దూళిపాళ్ల గోపాలయ్య, పొంగూరు వెంకటేశ్వర్లు, కొమ్మి బాలయ్య, బండి పెంచలమ్మ, బుర్రి కవితలను ఎంపిక చేశారు. ఇందుపూరు ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా గునపాటి ఫణికుమార్, ధర్మకర్తలుగా ఏలూరు భారతమ్మ, రత్నాకరం ప్రభావతమ్మ, దాసరి వెంకటేశ్వర్లు, పొన్నగంటి అంకమ్మ, గుడిపాటి వెంకట రత్నం, దుగ్గులూరు కృష్ణయ్య, చాట్ల నాగమ్మ, పాముల విమల, రత్నాకరం వెంకట రామలక్ష్మి ప్రసాద్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలక మండలిలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన సభ్యులు ఉండడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలను, ఛైర్మన్‌లను ఆయన సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి కోటారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, ఎందేటి హరికృష్ణ, అంబటి రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బోగోలు రైల్వే ఎల్సీగేట్-144 నేటి నుంచి మూత

బిట్రగుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని ఎల్సీగేట్-144 మంగళవారం నుంచి 6 రోజులు తాత్కాలికంగా మూసివేస్తునట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వేగేట్ సమీపంలో పట్టాల మార్పు, మెయింటెనెన్స్ పనుల కారణంగా మూత వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని గమమనించి కావలి వైపు వెళ్లే వాహనాలు శ్రీవేంకటేశ్వరపాలెం మీదుగా వెళ్లవచ్చని తెలిపారు. బోగోలు ఎల్సీగేట్-143 కుమ్మరవీధి గేటు వైపు వెళ్లేందుకు అవకాశం ఉందని తెలిపారు.


బోగోలు రైల్వే ఎల్సీగేట్-144 వద్ద ఆగిన వాహనాలు

కందుకూరు పట్టణాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధ కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరురోడ్డు జంక్షన్ వరకు రోడ్డు వెడల్పు, డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్ల పనులు ప్రస్తుతం జరుగుతుండగా అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి వాసవీకాలనీ వరకు రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మూడు రోజుల్లో భూమిపూజ చేయమని తెలిపారు. పట్టణంలో దశాబ్దాల క్రితం నిర్మించిన సైడుకాలువల స్థానంలో కాంక్రీట్ కాలువలు నిర్మించేందుకు రూ.2 కోట్ల నుడా నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని, రామాయపట్నం పోర్టు భూమిపూజ సందర్భంగా కందుకూరు పట్టణ అభివృద్ధికి రూ.20 కోట్లు ఇస్తున్నట్లు జగన్ ప్రకటించారే కానీ నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరు వచ్చినప్పుడు రూ.50 కోట్లు ఇస్తానని ప్రకటించగా ఇప్పటికే రూ.7 కోట్ల మంజూరయ్యాయని, మరో రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపగా త్వరలోనే విడుదల కానున్నాయని తెలిపారు. తొలి ఏడాదిలోనే రూ.10 కోట్లతో కందుకూరులో అభివృద్ధి పనులు చేశామన్నారు. పట్టణంలో ఇళ్లమధ్య ఉన్న డంపింగ్ యార్డులో లక్షటన్నుల చెత్త పేరుకుపోయిందని ప్రభుత్వ సహకారంతో ఈచెత్తను రీసైక్లింగ్ చేసే ప్రక్రియను మొదలు పెట్టామని, నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 500 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశామని తెలిపారు. సోమవారం 86 మందికి రూ.85.5 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చౌదరి

● ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ చైర్మన్


లింగసముద్రం మండలం చినపవని పీఏసీఎస్ చైర్మన్‌గా ఎంపికైన ముళ్లపాటి లక్ష్మీనరసింహం చౌదరి, సభ్యులు రావెళ్ల మాలకొండయ్య, కనపర్తి మాలకొండయ్యలు ఎమ్మెల్యే ఇంటూరిని కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వారివెంట రాళ్లపాడు ఆయకట్టు కమిటీ చైర్మన్ ఏలూరు వెంకటేశ్వర్లు, నాయకులు మోతుకూరు పర్వతాలు, సోంపల్లి మనోహర్, బుచ్చయ్య చౌదరి, మాధవరపు బ్రహ్మయ్య, కంకణాల సుబ్బులునాయుడు, గొర్రెపాటి శ్రీను, మేదరమిట్లపాలెం సర్పంచు కూరపాటి మాధవి తదితరులున్నారు.

కావలి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి


కావలిని జిల్లా కేంద్రం చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

కావలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కావలి కేంద్రంగా కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేసారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కావలిని 24వ జిల్లాగా చేయాలనే ప్రజల ఆకాంక్ష మేరకు ఉద్యమం జరిగిందన్నారు. కావలిని జిల్లాగా చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, వనరులు ఉన్నాయన్నారు. సువిశాలమైన సముద్ర తీర ప్రాంతం, రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి విమానశ్రయం, పోర్టు ఆధారిత పరిశ్రమలైన బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీలతో పటు పలు పరిశ్రమలు రానున్నాయన్నారు, రైల్వే లైన్, జాతీయ రహదారుల కనెక్టవిటీ ఉన్నాయన్నారు. వస్త్రరంగంలో కావలి మినీ ముంబైగా పేరొందిందన్నారు. కావలి జిల్లా ఏర్పడితే గుంటూరు-విజయవాడల జంటనగరాల లాగా అభివృద్ధి చెందటానికి వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధనసమితి సభ్యులు పులి రజని, పులి చక్రపాణి, కరవది భాస్కర్, అక్కిలగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోకూరు పీఏసీఎస్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం


చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న సెక్రటరీ, రైతులు

వలేటివారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు పీఏసీఎస్ అధ్యక్షుడుగా ఘట్టమనేని లక్ష్మీనరసింహం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ కార్యాలయంలో సొసైటీ పెయిడ్ సెక్రటరీ మద్దు మధుబాబు చైర్మన్ లక్ష్మీనరసింహం, డైరెక్టర్లు సాదం సుబ్బారావు, బత్తిన కృష్ణయార్తిలతో ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణపత్రం అందజేశారు. వారిని సెక్రటరీ, రైతులు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు గుర్రం లక్ష్మీనరసింహం, ప్రగడ శ్రీనివాసులు, ఇంటూరి రంగారావు, ప్రగడ మోహన్‌రావు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై ఇద్దరి మృతదేహాలు


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


నక్కా రాంకుమార్ (ఫైల్)

బిట్రగుంట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేసెక్షన్ పరిధిలోని తలమంచి- కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలను గుర్తించినట్లు కావలి జీఆర్పీ పోలీసులు సోమవారం తెలిపారు. తలమంచి రైల్వే స్టేషన్ యాడ్ దిగువ మార్గంలో ఉన్న సుమారు (35) ఏళ్ల యువకుడు మృతదేహం పరిస్థితిని బట్టి రైలు పట్టాలు దాటుతుండగా, లేదా రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు గ్రీన్, బ్రౌన్ కలర్ ఆఫ్ హ్యాండ్స్ టీషర్టు, బ్రౌన్ రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● హెల్త్ అసిస్టెంట్...

తలమంచి - కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ మార్గంలో సుమారు (54) ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అతని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారం విచారించగా ఒంగోలుకు చెందిన నక్కా రాంకుమార్‌గా గుర్తించారు. ఆయన బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ (విలేజ్ హెల్త్ క్లీనిక్ - విశ్వ నాథరావుపేట 1)లో పని చేస్తునట్లు బంధువుల సమాచారంతో నిర్ధారిం చారు. విధులకు హాజర య్యేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. రైల్లో నుంచి పడటం వలన మృతదేహం గుర్తుపట్టని రీతిలో ఉంది. రాంకుమార్‌కు భార్య ప్రసన్న, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కొద్దిపాటి వర్షానికే

చెరువులా ట్రంకు రోడ్డు

కావలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ఓ మోస్తవు వర్షం పడినా ట్రంకురోడ్డు జలమయం అవుతుండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రధానమైన ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు మూతబండలతో ఆక్రమణలకు గురికావటంతో కాలువల్లో పారాల్సిన నీరు రోడ్డుపైన పారుతుంది. కాలువలపై మూత బండలు వేసి ఆక్రమించటమే కాక దుకాణాల ముందు ఎత్తుగా మట్టి పోసుకోవడంతో ఇక వర్షపునీరు పోయేందుకు ఎటూ మార్గంలేక రోడ్డుపైనే నిలిచి పారాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం సాయంత్రం కురిసిన ఒక మోస్తరు వర్షానికి ట్రంకురోడ్డు జలమయం అయింది. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలకు వాహన చోదకులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ అధికారులు స్పందించి వర్షపునీరు కాలువల్లోకి వెళ్లే విధంగా ఆక్రమణలను తొలగించి నీరు వెళ్లే మార్గాలను సుగమమం చేయాల్సి ఉంది.


రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు